

కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న జేసీ తేజ్‌భరత్

కలెక్టర్‌గా ప్రశాంతి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, జూన్28(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు రెండో కలెక్టర్‌గా మహిళా ఐఏఎస్ అధికారి పి.ప్రశాంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2022లో కొత్త జిల్లాగా ఏర్పడిన తూర్పుగోదావరికి తొలి కలెక్టర్‌గా డా.కె.మాధవీలత బాధ్యతలు స్వీకరించారు. ఆమెను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆమె స్థానంలో రెండో కలెక్టర్‌గా కూడా మహిళా అధికారినే ప్రభుత్వం నియమించింది. విశాఖపట్నానికి చెందిన ప్రశాంతి 2014లో ఐఏఎస్‌కు అర్హత సాధించారు. అంతకు ముందు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె భర్త ఢిల్లీరావు కూడా ఐఏఎస్ అధికారే. వీరికి ఇద్దరు పిల్లలు. భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు ఆమె తొలి కలెక్టర్‌గా పనిచేశారు. ఎన్నికల ముందు వైసీపీ నేతల ఒత్తిడి వల్ల బదిలీ కాబడి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. శుక్రవారం సుమారు 12 గంటల ప్రాంతంలో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు జేసీ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి తదితర అధికారులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె జేసీ తేజ్ భరత్‌తో కలిసి రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

నన్నయలో..తినేశారు!

- అవినీతి కూపంలో నన్నయ వర్శిటీ
- ఇప్పటి వరకూ నలుగురు వీసీల బాధ్యతలు
- అందరిపైనా అవినీతి ఆరోపణలు
- వీసీ రాజీనామా చేయాలని గవర్నర్ ఆదేశం
- అయినా కదలని వీసీ పద్మరాజు
- రూ.7.5 కోట్ల బిల్లులు క్లియర్ చేసే పనిలో నిమగ్నం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నన్నయ వర్శిటీ అవినీతి ఆరోపణలతో అప్రదిష్టపాలైంది. ఒక పక్క అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు. మరో పక్క వీసీల ఇష్టారాజ్యంతో వర్శిటీలో అవినీతి బండారం బయటపడుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో వర్శిటీ పరిధిలో 200లకు పైగా కళాశాలలు ఉన్నాయి. ఈ వర్శిటీ 2006లో ఏర్పడింది. సొంత క్యాంపస్ ఏర్పాటుకు చాలా సమయం పట్టింది. రాజమహేంద్రవరం కేంద్రంగాదివాన్‌చెరువులో సుమారు 98 ఎకరాల్లో దీనిని నిర్మించారు. వర్శిటీ రాకముందు ఆర్ట్స్‌కాలేజీలోని కొన్ని భవనాల్లో కార్యకలాపాలు కొనసాగేవి. ఆ సమయంలో అక్రమంగా అధ్యాపకుల నియామకాలు జరగడంతో అది పెద్ద వివాదమైంది.ఆ తర్వాత జార్జి విక్టర్ వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో క్యాంపస్‌కు ఒక రూపు వచ్చింది. ఆయన హయాంలో ఒక వర్గం వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలున్నాయి. తర్వాత ముత్యాలనాయుడు వీసీగా ఉన్న సమయంలో కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయి. నియామకాల్లో వచ్చిన ఆరోపణలపై కమిటీలు వేసి విచారణ చేపట్టారు. మధ్యలో ఇన్‌చార్జిల పాలనలో కొనసాగింది. అనంతరం పద్మరాజు వీసీగా నియమితులయ్యారు. ఆయనపైనా విమర్శలు గుప్పుమన్నాయి. పద్మరాజు వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు బంధువు. దీంతో ఆయన ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్శిటీల్లో ఇప్పటి వరకూ ఉన్న వైస్‌చాన్సలర్లు అందరూ రాజీనామాలు చేయాలని గవర్నర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది రాజీనామా చేశారు. అయితే వీసీ పద్మరాజు మాత్రం ఇంకా కుర్చీపట్టుకుని వేలాడుతున్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో కొన్ని పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే పనిలో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. శుక్రవారం రూ.7.5 కోట్లకు చెందిన బిల్లును క్లియర్ చేయమని నోట్ ఆర్డర్ పెట్టినట్టు గవర్నర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రస్తుతం ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా వర్శిటీలో ఆయన హయాంలో జరిగిన పలు అంశాలపై కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఉంటూ వైసీపీ ప్రభుత్వంలో తన పలుకుబడి ఉపయోగించి నన్నయ్య వీసీగా పోస్టింగ్ పొందినట్టు సమాచారం. యూనివర్శిటీ



ఇంటర్నల్ ఫండ్స్‌పై వచ్చే వడ్డీని వర్శిటీ అవసరాలకు ఉపయోగించాలి. ఈ ఫండ్స్ బిల్డింగ్ కట్టడానికి అప్పటి ఉన్నత విద్యాశాఖాధికారుల నుంచి పర్మిషన్ తెచ్చుకున్నట్టు ఆరోపణలున్నాయి. అనర్హులైన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించి రూ.లక్షల రాబట్టుకున్నట్టు సమాచారం.అమెరికాలో ఆరునెలల పాటు సెలవులో ఉన్న ఒక ప్రొఫెసర్‌కు ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం కల్పించినట్టు చెబుతున్నారు. ఇక్కడ గిరిధర్ అనే ఒక ఉద్యోగికి రూ.35 వేల వేతనంతో ఉద్యోగం ఇవ్వడంతో ఆందోళన కూడా జరిగింది. ప్రశ్న పత్రాలు నాణ్యత పట్టించుకోకుండా,అయా కళాశాలలే ప్రింట్ చేసుకునేలా అవకతవలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేకపోయినా రిటైరైన ప్రొఫెసర్లకు రూ.వేలాది జీతం ఇస్తూ వారికి కార్లు, గెస్ట్‌హౌస్‌ల వంటి సౌకర్యాలు కల్పించినట్టు విమర్శలున్నాయి.వైసీపీ ఆడించినట్టు ఆడి.. యూనివర్శిటీ పరువు తీసినట్టు ఆరోపణలు ఉన్నాయి.ఇదిలా ఉండగా రాజీనామా చేయాలని గురువారం గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశించారు. అయితే ఆయన శుక్రవారం కూడా రాజీనామా చేయలేదు.ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ వర్శిటీని ఎంతో అభివృద్ధి చేశానన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పించన్లు సక్రమంగా పంపిణీ చేయండి

తొలిరోజే అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ -ఆఫీస్ విధానంలోనే నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజ నల్, మండల, మునిసిపల్ స్థాయి అధికారులతో శుక్ర వారం సాయంత్రం ఆమె పించన్ల పంపిణీ,సీజనల్ వ్యాధులు, స్వచ్ఛమైన మంచి నీరు సరఫరా వంటి అంశాలపై జేసీ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 2,44,302 మంది పించనుదారులకు రూ.165.13 కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు.అందరూ సమన్వయంతో ఉండాలని, జిల్లా యంత్రాంగా నికి సహకారం అందజేయాలని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉత్త ర్వుల మేరకు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని విధులు నిర్వహిం చడం కీలకమన్నారు.జూలై 1న ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులతో ఉదయం 6 గంటల నుంచే పించన్లు పంపిణీ చేయాలన్నారు. మునిసిపల్ అధికారులు, ఎంపీడీవోలు జిల్లాలో 9,551 క్లస్టర్ వారీగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. కస్టర్ వారిగా సీఎఫ్ఎంఎస్ గుర్తింపు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను లబ్ధిదారులకు అనుసంధానం చేస్తామని చెప్పారు.జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచి నీరు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేయడం వల్ల తనకు గోదావరి జిల్లాల పరిస్థితుల పట్ల కొంత అవగాహన ఉందన్నారు. ప్రస్తుత వర్షాకాల వాతావరణ పరిస్థితుల నేప థ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. డయేరియా కేసులు నమోదైతే అక్కడ పర్యటించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితితో నివేదిక ఇవ్వాలన్నారు.మంచినీటి సరఫరా చేసే ప్రాంతంలో నమూనా పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.గ్రామాలు, పురపాలక సంఘాల్లో ఓహెచ్ఆర్, ట్యాంకుల నిర్వహణ వ్యవస్థను స్వయంగా తనిఖీలు చేసి, రెండు మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సహకారం తీసు కోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి, జిల్లాసూక్ష్మ నీటి యాజమాన్య అధికారి ఎ.దుర్గేష్, భూగర్భజల అధికారి వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఎల్‌డీఎం డీవీవీ.ప్రసాద్, డీఎల్‌పీవోలు పి.వీణాదేవి,వి.శాంతమణి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీకి ఒక్కరు!

- సహకార సంఘానికో పర్సన్ ఇన్‌చార్జి
- జిల్లాలో 107 సొసైటీల్లో తక్షణం అమలు
- కూటమి ప్రభుత్వ ఉత్తర్వులు
- ఇప్పటికే వైసీపీ త్రిసభ్య కమిటీలు రాజీనామా
- మొండికేసిన మోర్త కమిటీ తొలగింపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సొసైటీ)లకు వైసీపీ బాధ తప్పింది. గత ఐదేళ్లుగా సొసైటీలు త్రీమెన్ కమిటీల పాల నలో ఉన్నాయి. సొసైటీలను రాజకీయ పునరావాసానికి కేంద్రాలుగా మార్చడంతో భారీగా అవకతవకలు జరిగినట్టు సమాచారం. ఇటీవల కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీలో బయటపడిన అక్రమమే దానికి ఉదాహరణ. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సొసైటీల త్రీమెన్ కమిటీలు రాజీనామాలు చేశాయి. ప్రస్తుతం వెంటనే ఎన్నికలు జరిపించే అవకాశం లేకపోవడంతో డిసెంబర్ 20వ తేదీ వరకూ సుమారు ఆరు నెలల పాటు సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కోఆపరేటివ్ అధికారులకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఎ.బాబు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలో 107 సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు.జిల్లాలో సహకార శాఖకు చెందిన ఉద్యోగులు 28 మంది మాత్రమే ఉండడం వల్ల ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు సొసైటీలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని 49 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్టు రాజమహేంద్రవరం డివిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో 58 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్టు కొవ్వూరు కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ తెలిపారు. జిల్లాలో ఉండ్రాజవరం మండలంలోని మోర్త సొసైటీ కమిటీ రాజీనామా చేయకపోవడంతో అధికారులే తొలగించి పర్సన్ ఇన్‌చార్జిని నియమించారు. ఇక నుంచి పాలకవర్గం బాధ్యత పర్సన్ ఇన్‌చార్జిలపై ఉంటుందన్నారు.



ఆర్అండ్‌బీ స్థలంలో అనుమతుల్లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

అక్రమంగా ప్యాలెస్‌ల నిర్మాణం

- వైసీపీ కార్యాలయాల నిర్మాణానికి నిధులెక్కడివి
- విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వాసు డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28 : జగన్ అవినీతికి అంతం లేదని.. రాజమహల్స్‌ని తలపించే రీతిలో వైసీపీ ఆఫీసుల నిర్మాణానికి సొమ్ములు ఎక్కడ నుంచి వచ్చాయో తేల్చాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆర్అండ్‌బీ భూమిలో నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సుమారు రూ.100 కోట్లు ఉండే 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఏడాదికి కేవలం రూ.వెయ్యి లీజుకి తీసేసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా ఇంతటి పెద్ద భవనాలు చేపట్టడంలో అంతర్యమేమిని ప్రశ్నించారు. ప్యాలెస్ మాదిరిగా జగన్ రెడ్డి ఎందుకు కట్టుకున్నారో అర్థంకావడం లేదన్నారు. వైసీపీ వాళ్ల ఇష్టానుసారం ప్రభుత్వ ఆస్తులను దోచేసి ఇష్టానుసారం కట్టేశారని ఆరోపించారు. అనుమతులు లేకుండా ఇంత పెద్ద భవనం కడుతుంటే కార్పొరేషన్ అధికారులు ఏంచేశారని.. రుడా ఏం చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. సహకరించిన అధికారులను ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, బీజేపీ నాయకులు బుర్రా రామచంద్రరావు, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, నాయకులు జక్కంపూడి అర్జున్ తదితరులు ఉన్నారు.

ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలు

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు iti.ap.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వచ్చే నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఒరిజినల్స్, ఒక జత జిరాక్సు కాపీలతో వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 92940 50231, 78010 95303 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



హతవిధి!

అంతా మాట్లాడి ఆమె వెళ్లిపోయారు.. ఇప్పుడెలా : బదిలీపై వెళ్లిన కలెక్టర్ మాధవీలతకు గతవారం వినతిపత్రం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు (ఫైల్)

ఎన్నికల బకాయి రూ.4.2 కోట్లు

- పనిచేసినా పైసలివ్వలేదు..
- పెరిగిపోయిన బకాయిలు
- బీఎల్‌వోలకు రూ.3 కోట్లు
- ఫొటోగ్రాఫర్లకు రూ.1.2 కోట్లు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- అయినా ఉపయోగంలేదు
- ఆర్డర్ ఇచ్చిన కలెక్టర్ బదిలీ
- మాట దాటవేస్తున్న జేసీ
- లబోదిబోమంటున్న బాధితులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు ముగిశాయి.ప్రభుత్వం ఏర్పడింది.. ఎన్నికల విధుల్లో భాగంగా పనిచేసిన కొంత మందికి పడిన బకాయి నేటికీ చెల్లించలేకపోయారు. ఎన్నడూ లేనిది అధికారులు అదిగో ఇదిగో అంటూ గడిపేస్తుండడంతో నిధులు వస్తాయో రావోనని అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం బీఎల్‌వోలు, ఫొటోగ్రాఫర్లకు ఎన్నికల సమయంలో విధులకు సంబంధించి బకాయిపడ్డారు.ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ ప్రైవేట్ ఫొటో గ్రాఫర్లను అద్దె ప్రాతిపదికన రంగంలోకి దించారు. ఎన్నికలు ముగిసినా డబ్బులు రాకపోవడంతో అధికారుల చుట్టూ ప్రద క్షిణలు చేస్తున్నారు.గత నాలుగేళ్లుగా ఓటర్ల జాబితాల తయారీలో నిమగ్నమై ఉన్న బీఎల్‌వోల పరిస్థితీ ఇలాగే ఉంది. కొత్త కలెక్టర్ అయినా తమ ఇక్కట్లు పట్టించుకుని బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఫొటోగ్రాఫర్లు 240 మంది..

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 240 మంది వీడియో గ్రాఫర్లను పాత కలెక్టర్ మాధవీలత నియమించారు. జీఎస్ఎల్‌లో తొలిగా సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలపై ఒప్పందం చేసుకున్నారు. 8 గంటలకు రూ.2250 చొప్పున ప్రతి పది రోజులకూ చెల్లింపు చేస్తా మని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆర్డరు కాపీలను కూడా వీడియోగ్రాఫర్లకు ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న వెలువడగా 17వ తేదీ నుంచి వీళ్లంతా కెమెరాలతో విధుల్లోకి వచ్చారు. అధికారులు కేటాయించిన చోట విధులు నిర్వర్తించారు. ప్రతి ఘటన వీడియో తీసి చిప్ లేదా సీడీలో నిక్షిప్తం చేసి అధికారులకు అందజేసేవారు. షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధుల్లో ఉండేవాళ్లు. విధుల్లో చేరిన పది రోజుల తర్వాత వీడియోగ్రాఫర్లు తమ డబ్బులను అడిగితే కాలయాపనతో నెట్టుకొచ్చారు. ఎన్నికలు ముగిసి.కొత్త ప్రభుత్వం కొలువుదీరి 25 రోజులు దాటినా వీడియోగ్రాఫర్ల చేతికి పూర్తి స్థాయిలో డబ్బులు అందలేదు.ఇదిలా ఉండగా మాధవీలత బదిలీపై వెళ్లిపోయారు. వీడియోగ్రాఫర్లు బదిలీ కలెక్టర్‌కు తమ బకాయిలను గుర్తుచేస్తే ఆ పని జేసీ చూస్తారని చెప్పారు. జేసీని అడిగితే బిల్లు పంపామని.. విజయవాడ ఎన్నికల సంఘం వద్దకు వెళ్లి అడగండని జేసీ ఉచిత ఇస్తున్నారని వీడియోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కలెక్టరుకు మళ్లీ లేఖ ఇవ్వాలని సూచించారన్నారు. మీకు ఆర్డరు ఎవరిచ్చారో వాళ్లను అడగాలంటూ అనపర్తి, గోపాలపురం ఆర్వోలు గదమాయిస్తున్నారని వాపోతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది

సొంత కెమెరాలు ఉన్నవాళ్లు కొందరైతే, కెమెరాలను అద్దెకు తెచ్చుకొని మరికొందరు పనిచేశారు.రాజమహేంద్రవరంసిటీకి సంబంధించి దాదాపు 70 శాతం చెల్లించగా..మిగతా నియోజకవర్గాల్లో 30 శాతం మాత్రమే చేతికందాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.అద్దెకు కెమెరాలు తెచ్చుకుని కష్టపడిన వాళ్ల సమస్య ఎదుర్కొం టున్నారు. అన్ని నియోజక వర్గాల్లో 58 రోజులకు కలిపి మొత్తం బకాయిలు రూ.1.20 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది.వాస్తవానికి ఎన్నికల ప్రక్రియకు అవసరమైన నిధులు ఎన్నికల సంఘం ద్వారా వస్తాయి. వీడియో గ్రాఫర్లకు సంబంధించి ఆర్వోలకు నేరుగా నిధులు వస్తాయని చెబుతున్నారు. అయితే, కలెక్టరు సూచ నల మేరకు వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆర్వోలు వీడియో గ్రాఫర్లకు సరైన సమాధానం చెప్పడం లేదని తెలుస్తోంది.

బీఎల్‌వోలు 1600 మంది..

బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వోలు) సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడంలో తమదైన పాత్ర పోషించారు. నాలుగేళ్ల నుంచీ రాత్రి పగలూ తేడా లేకుండా కసరత్తు చేశారు. ఓటరు గుర్తింపునకు ఆధార్ అనుసంధానం, ఓటరు తొలగింపు,చేర్పు, చిరునామా మార్పు, ఫిర్యాదుల పరిష్కారం వంటి కీలకమైన విధులు నిర్వ ర్తించారు.కానీ వారికి ఈ నాటికీ శ్రమకు తగిన ఫలితం అందలేదు. సుమారు మూడేళ్ల నుంచీ గౌరవ భృతి రాకపోయినా సొంత డబ్బులతో అధికారులు చెప్పిన పనులన్నీ చేశారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలుదీరినా వీరి డబ్బులు మాత్రం చేతిలో పడలేదు.2024 సార్వత్రిక ఎన్నికల నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 2020లో కసరత్తు మొదలైంది. సచివాలయ సిబ్బందిని బీఎల్‌వోలుగా నియమించారు. వారి రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే బీఎల్‌వో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇం టింటికీ వెళ్లి మార్పులుంటే ఓటరు జాబితాల్లో సవరణ చేయడం, ఆధార్ సీడింగ్ ముఖ్య విధులు.దీని కోసం యాప్‌లను ఇచ్చారు.సర్వర్లు నెమ్మదిగా ఉండడంతో రాత్రి వేళల్లో కూడా మహిళలు సైతం వీధుల్లో తిరిగి విధులు నిర్వర్తించారు. ఓటరు జాబితాల్లో తప్పులు సరిదిద్దారు.ఈ పనులు చేసినందుకు వీరికి నె లకు రూ.500 గౌరవ భృతి, ఏడాదికి రూ.వెయ్యి డీఏ, టీఏ, స్టేషనరీ కింద ఇవ్వాలని ఎన్నికల సం ఘం నిర్దేశించింది. కానీ, మూడేళ్ల నుంచీ ఖాతా లో ఆ సొమ్ములు జమ కాలేదు.జిల్లాలో సుమా రు 1,600 మంది బీఎల్‌వోలు విధులు నిర్వర్తించారు.వీరికి మూడేళ్లకు రూ.3 కోట్ల కుపైగా భృతి అందాల్సి ఉంది. అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు.

గౌరవ భృతి ఇవ్వడంలేదు..



ఎన్నికల సందర్భంగా నాలుగేళ్ల నుంచీ సమర్థవంతంగా పని చేశాం. ఎప్పటికప్పుడు గౌరవ భృతి, టీఏ, డీఏ ఇవ్వకపోయినా నిర్దేశిత సమయాలు లేకపోయినా రేయింబవళ్లు కష్టబడి అధికారులు చెప్పిన సమయానికి పనులు పూర్తి చేశాం.ఎన్నికలు సజావుగా జరగడానికి మా వంతు పాత్ర నిర్వర్తించాం. కానీ మా గౌరవ భృతి విషయంలో తీవ్రంగా జాప్యం కావడం ఆవేదనకు గురిచే స్తోంది.మండల స్థాయి అధికారులకు విన్నవించినా ఉపయోగం లేదు. ఉన్నత స్థాయి అధికారులు మా సమస్యకు పరిష్కారం చూపాలి.

- కాదంబరి సూర్య శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్, కడియం సచివాలయం

కొత్త కలెక్టర్‌కు లెటర్ ఇవ్వాలట..



మా బకాయిల విషయం జేసీ చూస్తారని పాత కలెక్టర్ చెప్పి వారం అయిపోయింది. ఆమె రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. రోజులు గడుస్తున్నాయే గానీ డబ్బులు ఇవ్వడం లేదు. మళ్లీ ఈ శుక్రవారం కలెక్టరేట్‌కి వెళ్తే.. కొత్త కలెక్టర్ ఇప్పుడే చార్జి తీసుకున్నారు. రేపు వచ్చి ఆమెకు మళ్లీ లెటర్ ఇవ్వండని చాలా సులభంగా చెప్పేశారు. చిన్నోళ్లమని ఇబ్బంది పెడితే ఎలా?. మేం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు అర్థం చేసుకోవాలి.

- కోనీ శ్రీను, అధ్యక్షుడు, జిల్లా ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

జేసీ విజయవాడ వెళ్లమంటున్నారు..



మా బకాయిల కోసం గత శుక్రవారం ధర్నా చేసిన ప్పుడు జేసీ, కలెక్టర్(పాత) లోపలికి పిలిపించి ఎలక్షన్ కమిషన్‌కి బిల్లు పెట్టామని, బకాయిలు వచ్చేస్తాయని చెప్పారు. కానీ ఫలితం లేదు.వారం తర్వాత ఈ రోజు (శుక్రవారం) జేసీని కలిశాం. విజయవాడ వెళ్లి ఎలక్షన్ కమిషన్‌ని కలవండని అంటున్నారు. పనికి ముందు 10 రోజులకు ఒకసారి పేమెంట్ చేస్తామన్నారు. ఇప్పుడు పని అయిపోయిన తర్వాత ఇలా అనడం ఎంత వరకూ న్యా యం.

- ఎ.ఫణి కుమార్, కార్యదర్శి, జిల్లా ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్

నేడు జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ శనివారం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. ఉదయం 10గంటల నుంచి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌కి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం,రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు కోర్టుల్లో ఏర్పాట్లు చేశామన్నారు. పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

పొగాకు ధరహాసం

కేజీ రూ.368 పలికిన రికార్డు స్థాయి ధర

గోదావరిలో దూకిన మహిళ సురక్షితం

1న పిఠాపురానికి పవన్ రాక

6



నెలవారీ నేరసమీక్షలో భాగంగా ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న పోలీసులు

సైబర్ నేరాలపై దృష్టి పెట్టండి

నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సైబర్, మహిళలపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని.ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం మరింత పెంపొందే విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాలు,సారా, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసుల పరిష్కారం దిశగా కృషి చేస్తూ శిక్షలు పడే శాతాన్ని పెంచాలన్నారు. పగలు, రాత్రి గస్తీని విస్తరించి సరైన రీతిలో పెట్రోలింగ్ జరిగేలా అధికారులు చూసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, అల్లరి మూకలపై నిఘా పటిష్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, ఇష్టానుసారం డ్రైవింగ్ చేయడం వంటి వాటిని ఉపేక్షించవద్దన్నారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. స్కూల్స్, కాలేజీల వద్ద ట్రాఫిక్ నిబంధనలపై, మాదకద్రవ్యాల వాడకం వల్ల దుష్పరిణామాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు.డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం(మీకోసం)కు వచ్చే ఫిర్యాదులపై త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల విధుల్లో ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, టి.సర్కార్, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

అయిదేళ్లూ అరాచకం

- నేడు కాకినాడ జిల్లా రైసుమిల్లర్లతో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల సమీక్ష
- జిల్లాలో అయిదేళ్లుగా మిల్లుల అక్రమాలపై కన్నెత్తే నాథుడే కరువు
- ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో ఎంత అవినీతి జరిగినా మిల్లుల్లో తనిఖీలు నిల్
- రైస్‌మిల్లులన్నీ ద్వారంపూడి కుటుంబం కనుసన్నల్లో ఉండడంతో అధికారుల్లో వణుకు
- ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మిల్లుల్లో మోసాలపై తనిఖీకి జేసీకి సైతం వణుకు
- అనేక మిల్లుల్లో యథేచ్ఛగా రేషన్‌బియ్యం రీసైక్లింగ్ • కీలక అధికారులకు లక్షల్లో ముడుపులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో అనేక రైసు మిల్లులు అక్రమాలకు అడ్డాగా మారాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలు, రవాణా సమయంలో రైతులను నిలువునా మోసం చేస్తున్నాయి. పౌరసరఫరాల సంస్థకు ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు(బీజీ) సమర్పించే దగ్గర నుంచి సీఎంఆర్ ధాన్యం స్థానంలో ఒడిషా బియ్యం అంటగట్టినా అడిగే నాథుడే లేరు. కాకినాడజిల్లాలో ఎన్నో ఏళ్లుగా రైసుమిల్లులకు ద్వారంపూడి కుటుంబమే జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతోంది. వైసీపీ పాలనలో జిల్లా, రాష్ట్ర అధ్యక్ష పదవులు ఈ కుటుం బమే అనుభవించింది. అటు ద్వారంపూడి తండ్రి పౌరసరఫరాల సంస చైర్మన్‌గా వ్యవహరించారు. దీంతో జిల్లాలో రైసుమిల్లర్లు అంతా ఈ కుటుంబం కనుసన్నల్లోనే ఉండేవారు. కప్పాలు, అమ్యామ్యాలు వీరు ఎంత అడిగితే అంత సమర్పించాల్సిందే. దీంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ద్వారంపూడి కుటుంబానికి భయపడి ఏనాడు ఏ మిల్లుపైనా దాడి చేయడానికి సాహసించలేదు. వాస్తవానికి జిల్లాలో సార్టెక్స్, ఫోర్టిఫైడ్ రైసు మిల్లులు 210కిపైనే ఉన్నాయి. వీటిలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఆర్‌బీకేలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తీసుకుని మర ఆడించి ఇవ్వాలి. కానీ అదే సమయంలో పలు మిల్లులు ఒడిషా నుంచి కారుచౌకగా ధాన్యం కొనుగోలుచేసి మర ఆడించి తీసుకున్న ధాన్యం రకం బదులు ఒడిషా ధాన్యం మర ఆడించి అంటగడుతున్నాయి. ఇలా మిగుల్చుకున్న జిల్లాలో పండిన బియ్యాన్ని పాలిష్‌చేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లలో సంపాదిస్తున్నాయి.

తనిఖీల ఊసే లేదు..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైసుమిల్లుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఎంత ధాన్యం వెళ్లిందో అంతే నిల్వ ఉండాలి. కానీ దీనికి సమానంగా ఒడిషా ధాన్యం ఉంటున్నాయి. వీటిని తనిఖీచేసి స్వాధీనం చేసుకుని మిల్లులపై కేసులు నమోదు చేయాలి. కానీ ద్వారంపూడి కుటుంబానికి భయపడి జిల్లా పౌరస రఫరాల సంస్థ డీఎం నుంచి జాయింట్ కలెక్టర్ వరకు మిల్లులవైపు కన్నెత్తి చూడ్డానికి కూడా గత అయిదేళ్లలో సాహ సించలేదు. కానీ ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో మిల్లర్ల నుంచి జిల్లావ్యాప్తంగా కోట్లలో ముడుపులు వసూలుచేసి ఆయా కీలక అధికారులకు చదివించడం మామూలుగా వస్తోంది. దీంతో జిల్లాలో మిల్లులపై దాడులు అనే సంగతే అంతా మర్చిపోయారు. రేషన్ బియ్యం కాకినాడజిల్లాలో ద్వారంపూడితోపాటు ఆయన కుటుంబం ఆశీస్సులు ఉన్న పలు మిల్లుల్లో యథేచ్ఛగా రీ సైక్లింగ్ జరిగిపోతోంది. కానీ ఏనాడు అధికారులు ఏ మిల్లు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనేక మిల్లుల్లో రేషన్ దందా, ధాన్యం దందా యథేచ్ఛగా జరుగుతోంది. కొన్ని మిల్లులు నిబంధ నల ప్రకారం వ్యవహ రించినా ద్వారంపూడి కుటుంబాన్నికాదని మిల్లులు నడిపించే పరిస్థితిలేదు. గట్టిగా ప్రశ్నిస్తే అధికారుల ద్వారా దాడులు, లేదా ధాన్యం సేకరణనుంచి తప్పించడం చేస్తారనే భయం భయంతో నడుస్తున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేప థ్యంలో పౌరసరఫరాలశాఖ మంత్రిగా నాదెండ్ల శనివారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో మిల్లర్ల అక్రమాలపై గట్టిగా ప్రశ్నించడంతోపాటు నిబంధనలు, మోసాలకు పాల్పడే మిల్లులను సీజ్ చేసేలా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. జిల్లాలో మిల్లులపై ద్వారంపూడి కుటుంబం పెత్తనం ఉన్నంతకాలం రేషన్ బియ్యం మాఫియా, ధాన్యం కొనుగోలులో మిల్లుల మతలబులు ఆగే పరిస్థితిలేదని అధికారులే చెబుతున్నారు. మరోపక్క గడచిన ఐదేళ్లలో పౌరసరఫరాల సంస్థ డీఎం, జేసీ, ఇతర రెవెన్యూ అధికారులు ఎన్ని మిల్లుల్లో తనిఖీలు చేశారనేది నిలదీస్తే బండారం అంతా బయటపడ నుంది. జిల్లాలో మిల్లర్లకు రావాల్సిన బకాయిల్లోను ద్వారంపూడి కుటుంబం కమీషన్లు భారీగా కొట్టేసింది. బిల్లులు ఇప్పించే పేరుతో పర్సంటేజీలు బాదేసి కోట్లలో ఆర్జించిందని మిల్లర్లే లబోదిబోమంటున్నారు.



నడకుదురులోని గోదామును తనిఖీచేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నడకుదురులో గోదాముల తనిఖీ

- మంత్రి ఆదేశాలతో రూ.13.50కోట్ల సరుకు సీజ్

కరప, జూన్ 28: రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన గోదాములను తనిఖీచేశారు. గోదాములలోని పీడీఎస్ రైస్‌ను పాలిస్ పట్టించినట్టుగా గుర్తించిన మంత్రి రికార్డులను తనిఖీచేశారు. గోదాములోని నిల్వలకు, రికార్డులకు పొంతన లేకపోవడంతో బాటు పలు అవకతవకలను పసిగట్టిన మంత్రి గోదాములను సీజ్‌చేసి మొత్తం వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రెండు గోదాములలో ఉన్న, బయట లారీల్లో ఎక్కించిన బియ్యం, నూక, ఇతర సరుకులను లెక్కించారు. చివరకు రూ.13కోట్ల40లక్షల59వేల570ల విలువ కలిగిన 4,531.14 టన్నుల సరుకును సీజ్‌చేశారు. అలాగే ఉప్పలంకలోని సరళ ఫుడ్స్ రైస్‌మిల్లును మంత్రి తనిఖీచేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దాన్ని కూడా సీజ్‌చేయాలని ఆదేశించారు. ఈ రైస్‌మిల్లులోని వివిధ రూపాల్లో ఉన్న సరుకును కూడా అధికారులు లెక్కిస్తున్నారు. తహాశీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఆర్‌ఐ మాచరరావు, వీఆర్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

1న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూన్ 28: వికాస ఆధ్వర్యంలో జూలై 1న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భవి క్రియేషన్స్ కంపెనీలో సోషల్ మీడియా మేనేజర్, కాశీస్వరి రిఫైనరీ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్, శ్రీగోపాల్ ఆటోమోటివ్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్, అసిస్టెంట్ మేనేజర్, బాలాజీ కెపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, టెలీకాలర్స్, డేటా సోర్సింగ్ ఆఫీసర్, యాక్సెస్ బ్యాంకులో బిజినెస్ డెవలప్‌మంట్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్‌కెమికల్స్ ట్రైనీ ప్రొడక్షన్, కో-జెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీవో, రాక్‌మెన్ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76111లో సంప్రదించాలన్నారు.

పీఏసీఎస్‌లకు
సహకార శాఖాధికారులు పీఐసీలుగా నియామకం

కాకినాడరూరల్, జూన్ 28: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల సొసైటీలకు గతంలో నియమించిన కమిటీలు రద్దయ్యాయి. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సంబంధిత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవరకూ వాటి పాలనా బాధ్యతలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో గల 298 పీఏసీఎస్‌లకు సహకార శాఖాధికారులను పీఐసీ(పర్సన్ ఇన్‌ఛార్జ్)లుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వారి పదవీకాలం లేదా పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేవరకూ పీఐసీలను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పీఐసీలను నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.దీంతో సహకారరంగంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించినట్లయింది.



పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో డిప్యూటీ సీఎం పవన్ నిర్వహించే సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు సగిలి షాన్ మోహన్

పవన్ పర్యటన
ఏర్పాట్లపై కలెక్టరు సమీక్ష

- సభ నిర్వహించే ప్రాంతం పరిశీలన

పిఠాపురం, జూన్ 28: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం వచ్చేనెల 1న తొలిసారి నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి సభలో పవన్ పాల్గొననున్నారు. పవన్ సభ నిర్వహించే ప్రాంతాన్ని కలెక్టరు పరిశీలించారు. వారాహి సభకు సంబంధించిన వివరాలపై అధికారులను ఆరా తీశారు. సభకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టరు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో విజయం అనంతరం పవన్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ కావడంతో భారీఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జడ్పీ సీఈవో రామచంద్రమూర్తి, పిఠాపురం తహసీల్దారు లక్ష్మీ, మునిసిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ ఇక్కడి నుంచే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాలను రూ.4వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి పెంపును అమలు చేస్తున్న నేపథ్యంలో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.7వేలు అందించే కార్యక్రమానికి పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో వారాహి సభను 2వ తేదీన నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

చేపలతో నిరసన

మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ మహిళల ఆందోళన



చేపలతో ఆందోళన చేస్తున్న మహిళలు, వారితో మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణ, పోలీసులు

యానాం, జూన్ 28: చేపలను విక్రయించే మహిళలు మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా చేపల బుట్టలు పెట్టి సమస్యలను పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, ఎస్ఐ ముగురనందం వచ్చి మహిళలతో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వివరించారు. ముఖ్యంగా రబ్బరుమ్యాట్‌లు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిత్యం ఎవరో ఒకరు గాయాలపాలవుతున్నారన్నారు. రాత్రి సమయంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలన్నారు. మార్కెట్లో దాచుకున్న చేపలను అపహరించుకుపోతున్నారన్నారు. సాయంత్రం పలువురు మద్యం సేవించి వికృత చేష్టలు చేస్తున్నారన్నారు. మార్కెట్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కుళాయిలు, ఫ్యాన్లు వేయాలని, చేపలు శుభ్రం చేస్తున్న వారికి షెడ్డు నిర్మించాలని కోరారు. యానాం మార్కెట్లోని చేపలు మాత్రమే విక్రయించాలని, బయటి ప్రాంతాల చేపలు విక్రయించకుండా చూడాలన్నారు. సమస్యలను వారంలో పరిష్కరి స్తామని కమిషనరు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.అధికారులు మార్కెట్‌ను పరిశీలిస్తున్న సమయంలోనే రత్నం అనే మహిళ జారిపడింది. గాయాలపాలైన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వంతెన నిర్మాణాన్ని మ్యాప్ ద్వారా వివరిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు

బిల్లుల మంజూరులో జాప్యం

- ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడి పంచాయతీ పరిధిలో వంతెన నిర్మాణానికి సం బంధించిన బిల్లుల మంజూరులో జాప్యాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.12 కోట్లు మంజూరయ్యేలా కృషిచేస్తానని చెప్పా రు. రూ.49.50కోట్లతో నిర్మిస్తున్న వంతెన డిజైన్ మ్యాప్‌ను శుక్రవారం ఆయన జనసేన క్యాంపు కార్యాలయంలో అధికారుల సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ లంక గ్రామాలకు వంతెన నిర్మాణం దశాబ్దాల కలగా మిగిలిపో యిందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. వంతెన నిర్మాణంలో ఇప్పటివరకు దాదాపు మూడు పిల్లర్లు, రెండు వెల్స్ పూర్తయ్యాయని ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు ఎమ్మెల్యేకు వివరించారు. లంక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా న్నారు. ఏఈఈ దుర్గా కొండలరావు, ఏఈ గంగాధర్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్య కాపు, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ

- భర్త అక్కడికక్కడే మృతి
- భార్యకు తీవ్ర గాయాలు..
- ఆసుపత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



వానపల్లి ప్రధాన రహదారి మలుపులో భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనివాసపల్లంరాజు (ఫైల్)

కొత్తపేట, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి ప్రధాన రహదారి మలుపులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతిచెందగా భార్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... వానపల్లి సంగం పాలేనికి చెందిన యిళ్ల శ్రీనివాసపల్లంరాజు (49) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇతనికి శుక్రవారం మధ్యాహ్నం పొలంలో విషపు పురుగు కుట్టినట్టు అనుమానం రావడంతో స్నేక్ వీనమ్ వ్యాక్సిన్ కోసం భార్య నారాయణమ్మతో కలిసి వానపల్లి పీహెచ్‌సీకి బయల్దేరాడు. వ్యాక్సిన్ అందుబాటులో లేదని, కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ఉందని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో దంపతు లిద్దరూ మోటారు సైకిల్‌పై కొత్తపేట ప్రభుత్వాసుత్రికి వెళ్లి వ్యాక్సిన్ చేయించుకుని ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో వానపల్లి మలుపువద్ద కాట్రేనికోన నుంచి ధాన్యం లోడుతో ద్వారపూడి వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. శ్రీనివాసపల్లంరాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు, తలకు తీవ్ర గాయాలైన నారాయణమ్మను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడికి వరుసకు తమ్ముడైన యిళ్ల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు

- కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 28: ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందజేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర అన్నారు. కాకినాడ రాజాట్యాంక్ ఆవరణలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో బ్యాంకు 45వ వార్షిక మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ సభ్యులకు 15శాతం డివిడెండు చెల్లించనున్నట్లు వెల్లడించారు. రూ.1753కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో టౌన్ బ్యాంక్ 2వ స్థానంలో ఉందన్నారు. ఈఏడాది మార్చి 31నాటికి డిపాజిట్లు రూ.1,056.73కోట్లు, లోన్లు రూ.696.47 కోట్లు, ఇన్‌వెస్ట్‌మెంట్లు రూ.447.35కోట్లు, బ్యాంకు సొంత నిధులు రూ.172.13కోట్లు ఉన్నాయన్నారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో సి.సుగుణారావు ప్రవేశపెట్టిన వివిధ అజెండా అంశాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, జీఏ కళ్యాణ్ ప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

శ్రీరామగిరి ఆలయంలో
వాహన విగ్రహాలు చోరీ





ఆలయంలో విచారణచేపడుతున్న ఎస్ఐ నాగరాజు

అపహరణకు గురైన వాహన విగ్రహాలు (ఫైల్)

వరరామచంద్రాపురం, జూన్ 28: మండలంలోని రెండవ భద్రగిరిగా పేరు గాంచిన శ్రీరామగిరి ఆలయంలోని వాహన విగ్రహాలు (ఇత్తడి) గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఆలయంలో పనిచేస్తున్న స్వీపర్ ఉదయాన్నే ఆలయానికి వెళ్లగా వాహన విగ్రహాలు లేకపోవడంతో అతను గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు వెళ్లి చూడగా విగ్రహాలు అపహరణకు గురయ్యాయని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచాలం ఇచ్చారు. దీంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో శ్రీరామగిరి ఆలయానికి చేరుకొని గ్రామస్తులను, ఆలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీకి గురైన ప్రదేశాన్ని క్షుణంగా పరిశీలించారు. అపహరణకు గురైన విగ్రహాలు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన అ త్యంత పురాతనమైన గరుడ, అశ్వం ఆంజనేయస్వామి వాహన విగ్రహాలు. అవి ఇత్తడి, లోహంతో తయారుచేసిన విగ్రహాలు అని గ్రామస్తులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐతోపాటు ఆలయ చైర్మన్ రేవు బాల రాజు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ నాయకులు ముత్యాల రామారావు, ఆచంటి శ్రీను, బొర్ర నరసింహరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన మహిళ సురక్షితం

- సమయానికి స్పందించిన పోలీసులు



గోదావరిలో మహిళను రక్షిస్తున్న జాలర్లు



రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం 5గంటల సమయం.. ఓ మహిళ ప్రాణాలు తీసుకో వడానికి గోదావరిలో దూకింది.. అది చూసి అటుగా వెళ్తున ఓ వ్యక్తి పోలీ సులకు ఫోన్ చేశారు.. వెంటనే పోలీసులు స్పందించారు.. జాలరుల సహాయంతో బోటులో వెళ్లి ఆమెను రక్షించారు. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని మల్లికార్జున నగర్‌కి చెందిన దూడల నాగలక్ష్మికి తన భర్తతో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆమె రోడ్‌కం రైలువంతెనపైకి చేరుకొని గోదావరిలో దూకేశ్లింది. అటుగా వెళ్తున్న వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే ఎస్ఐ రత్తయ్య, కానిస్టేబుల్ లీలాకుమార్ అప్రమత్త మయ్యారు. అక్కడికి దగ్గరి రేవులోని జాలరులకు సమాచారం ఇస్తూనే ఘటనా ప్రదే శానికి బయలుదేరారు. నీటిపై తేలుతున్న ఆ మహిళ వద్దకు బోటులో జాలరులతో వెళ్లి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నాగలక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చి సంబంధీకులకు అప్పగించామని సీఐ తెలిపారు. విధుల్లో ప్రతిభ చూపిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఉమామహేశ్వరరావు, గాయపడ్డ ప్రకాష్

అమలాపురంరూరల్, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గుడాల ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు సూచించారు. సబ్‌స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ విభాగంలో షిఫ్ట్ ఆపరేటర్, అసిస్టెంట్లయిన ఉమామహేశ్వరావు, వి.ప్రకాష్ అంబాజీపేట ఫీడర్ ట్రిప్ కావడంతో ఎల్‌సీ ఇచ్చి పనులు చేపట్టారు. అదే సమయంలో ఉప్పలగుప్తం ఫీడర్ కూడా ఎల్‌సీ కోరారు. ఆ సమయంలో ఎర్త్ రాడ్స్ మెయిన్‌లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పెద్ద శబ్దంతో పేలింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, ప్రకాష్ స్వల్పంగా గాయపడ్డాడు. వారిద్దరినీ చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనా ప్రాంతాన్ని ట్రాన్స్‌కో డీఈ హేమలత, ఏడీఈ భగవాన్ పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టి గాయపడ్డ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు దిగుమతి

సామర్లకోట, జూన్ 28: సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు మధ్యప్రదేశ్ నుంచి శుక్రవారం 1,800మెట్రిక్ టన్నుల గోధుమలు దిగుమతులు అయ్యాయి. మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు రవాణాకు వినియోగించిన గూడ్స్‌రైలు సామర్లకోటకు చేరుకుంది. సామర్లకోట ఏడీబీ రోడ్డులో లలితా ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ ఈ గోధుమలను దిగుమతులు చేసుకుంది. రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.35లక్షల మేర చెల్లించినట్లు సమాచారం. గోధుమలు సామర్లకోటలో దిగుమతులు, తిరిగి లారీల ద్వారా ఎగుమతులుకు చెందిన సుమారు 100 లారీలకు రవాణా చార్జీలుగానూ, దిగుమతులు, ఎగుమతులు ద్వారా హమాలీలు సుమారు 150మందికి ఉపాధి లభించినట్లైంది. సామర్లకోట పరిసరాలలో పరిశ్రమలకు మరో 30వేల మెట్రిక్ టన్నుల మేర గోధుమలు దిగుమతులు కాగలవని రైల్వే అధికారులు చెప్పారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 28: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కె.సుధారాణి రూ.1,00,400 విరాళంగా సమర్పించారు. ఈమొత్తాన్ని దాత ఏఈఓ గణపతికి అంద జేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

సీలేరు నదిలో బాలుడు గల్లంతు



సీలేరు నదిలో గల్లంతైన బాలుడు (ఫైల్)

చింతూరు, జూన్ 28: ప్రమాదవశాత్తు ఒక బాలుడు సీలేరునదిలో పడి గల్లంతయ్యాడు. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా మడతల్ గ్రామానికి చెందిన సోయం ముఖేష్ తన కుమారుడు సింకుని వెంట బెట్టుకొని చింతూరు మండలం, కొత్తపల్లిలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చాడు. కాగా కొత్తపల్లి సీలేరు నదిని ఆనుకొని ఉండడంతో నది వద్దకు కొంతమందితో కలసి వెళ్లిన సింకు(7) ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. దీంతో నది ప్రవాహంలో సింకు కొట్టుకుపోయాడు. సింకుకోసం గ్రామస్థులు గాలించినప్పటికీ ఆచూకీ కానరాలేదు.



గోపాలపురం వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకుబేళ్లు

పొగాకు అ'ధర'హో..

- సిరులు కురిపిస్తున్న పొగాకు సాగు • వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధిక ధర

గోపాలపురం, జూన్28: ఏజెన్సీ మెట్టప్రాంత రైతాంగానికి పొగాకు సాగు సిరులు కురిపిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో తేలికనేలల్లో పండే వర్జీనియ పొగాకుపంట లేకపోతే రైతులతో పాటు రైతుకూలీలకు ఒకప్పుడు పని ఉండేది కాదు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు గత 50ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలుకుతుంది. ఈ ప్రాంతంలో పండేపంట దేశంలోనే నాణ్యమైనది కావడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ రాష్ట్రంలో పండే పొగాకు పంటకు ధరలో వ్యత్యాసం పలుకుతోంది. గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొగాకు రైతాంగం అప్పులు తీరగా రెండో ఏడాది పంట వేయకతప్పడం లేదనే భావనలో ఉన్నారు. రెండేళ్ల నుంచి పొగాకు సాగు ప్రా రంభం నుంచి ఎన్నడు లేని ధరలు కిలో పొగాకు ధర రూ.368 పలికింది. దీంతో తమ కష్టానికి తగిన ఫలితం చూస్తున్నామనే భావనతో పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు, రైతుకూలీలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ధరకు తగ్గ దిగుబడి లేదు

- ముళ్ళపూడి శివాజీ, పొగాకు రైతు, చెరుకుమిల్లి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పెట్టుబడికి తగిన దిగుబడి రాలేదు. అయితే పొగాకు సాగు చేసే రైతులకు పెట్టుబడుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

ధరల పెంపుతో ఊరట

- కొడవటి చినవెంకటేశ్వరరావు, పొగాకు రైతు, గోపాలపురం.

పొగాకు సాగు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చరిత్రలో ఎన్నడు లేని విధంగా సన్న, చిన్నకారు రైతులు పొగాకు ధరతో ఊపిరి పీల్చుకున్నారు. నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుందామనే స్థితి నుంచి కుటుంబ సమేతంగా గుప్పెడు మెతుకులు తింటున్నామన్న భావం వచ్చింది. పొగాకు ధరలు పెరగడం చిన్న, సన్నకారు రైతులకు ఊరటనిచ్చినట్లయ్యింది.

అట్టహాసంగా అన్నవరం దేవస్థానం
వ్రతపురోహిత యూనియన్ ప్రమాణస్వీకారం

అన్నవరం, జూన్ 28: ఇటీవల ఎన్నికైన అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత యూనియన్ అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, కార్యదర్శి సవితాల వీరబాబు, కోశాధికారి మెకరాల రాజేష్‌లు శుక్రవారం సాయంత్రం యూనియన్ సభ్యుల సమక్షంలో ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షుడు కన్నబాబు మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం వ్రతపురోహితుల ద్వారా దేవస్థానం ఖ్యాతిని మరింత ఇనుమడింపచేసి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో వ్రతపురోహిత సూపర్‌వైజర్లు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న వ్రతపురోహిత యూనియన్ నాయకులు

ఏజెన్సీ సమాచారం

ఐటీడీఏలపై కొత్త కలెక్టర్ దృష్టి

● రంప, చింతూరు, పాడేరు ఐటీడీఏ కార్యకలాపాలపై పీవోలకు నిర్దేశం

రంపచోడవరం, జూన్ 28: అల్లూరి జిల్లా పరిధిలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలపై కొత్త కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టి సారించి ఆయా ఐటీడీఏల కార్యకలాపాలను నిర్దేశించారు. తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం తనను కలిసిన మూడు ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులతో ఆయా ఐటీడీఏల కార్యకలాపాలను సమీక్షించిన ఆయన ప్రభుత్వ ప్రాధాన్యాల మేరకు ఖచ్చితమైన విధానాలతో ఐటీడీఏలను నడిపించాలని సూచించారు. ముఖ్యంగా గతంలో తాను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన కాలంలో అమలులో ఉన్న పథకాల తీరు తెన్నులు, వాటి ఫలితాలపై ఆరా తీశారు. గిరిజన సంక్షేమ విద్యాలయాలు, గురుకుల విద్యాలయాలు, వసతిగృహాల నిర్వహణ, ఇంజనీరింగ్ పనులు, మౌళిక వసతులు, వైద్య సేవలు తదితర విభాగాల పనితీరును కూడా ఆయన ఆరా తీశారు. ప్రతి సోమవారం రంపచోడవరంలోనూ, ప్రతి బుధవారం చింతూరులోనూ ఐటీడీఏల్లో గ్రీవెన్సెస్ సెల్‌ను నిర్వహించాలని, సాధ్యమైన మేరకు ఈ రెండురోజుల కోసం కలెక్టరుగానూ, ఐటీడీఏల ఛైర్మన్‌గానూ తాను హాజరవుతానని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాజెక్టు అధికారులు కూడా నిస్తేజంగా ఉండటానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని, ఎక్కడా అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా చూడాలని కూడా సూచించారు. అందరి సెక్టోరల్ అధికారులకు కూడా ఈ మేరకు దశా నిర్దేశం చేయాలని కూడా కలెక్టరు సూచించారు. త్వరలోనే అన్ని ఐటీడీఏలను పర్యటించి ఆయా కార్యక్రమాలను సమీక్షిస్తానని వారికి స్పష్టం చేశారు. ఇదేకాక రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస అంశాలపై కూడా కలెక్టర్ దినేష్ ఆరా తీశారు.

ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలి

ఎటపాక, జూన్ 28: రానున్న వర్షాలకు గోదావరి వరదలు దృష్టిలో పెట్టుకుని ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. వరుసగా గోదావరి వరదలు విలీన మండలాలను ముంచెత్తుతున్నాయని గత ప్రభుత్వాలు ఇక్కడ ప్రజలకు సహాయక చర్యలు అందించడంలో విఫలమయ్యాయన్నారు. ఇప్పటికైనా బఫర్‌స్టాక్ ఏర్పాటుచేయాలని నిత్యావసర వస్తువులు కిరోసిన్ మంచినీటితోపాటు అన్ని గ్రామాల్లో ఉంచాలన్నారు. అనంతరం ఎటపాక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

'ఏజెన్సీలో డీఎస్సీ ప్రకటించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడుజోగారావు

కూనవరం, జూన్28: ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు అన్నారు. బీఈడీ, డీఈడీ, పీఈటీ చేసిన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2024 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. సీఎం జోక్యం చేసుకుని స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, కె.రాజు, కార్తీక్ తదితరులు పాల్గొనారు.

వరి విత్తనాలు పంపిణీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, జూన్ 28: మండలంలోని మడిచర్ల రైతు భరోసా కేంద్రంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశాల మేరకు రైతులకు 90శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదిరెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రోహిత్ మీరా, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి: ఎమ్మెల్యే శిరీషాదేవి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, జూన్ 28: అంగన్‌వాడీ కేంద్రాలలో బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం మెనూ ప్రకారం అందించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక రెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం స్థానిక గంగాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

గిరిజన బాలుర ఆశ్రమ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్28: వై.రామవరం మండలం మంగంపాడు గ్రామంలో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కరకావెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని మరింత కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఎటువంటి చెడు అలవాట్లకు లోనవకుండా శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పంచాయతీ వార్డుమెంబర్ నీలాపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షం వస్తే ఆసుపత్రి జలమయం

● మోతుగూడెం ప్రాథమిక ఆసుపత్రి దుస్థితి

● నిర్మాణం పూర్తికాని కొత్త ఆసుపత్రి ● ఇబ్బందులు పడుతున్న రోగులు

మోతుగూడెం, జూన్ 28: చింతూరు మండలం మోతుగూడెంలో వర్షం పడితే ప్రాథమిక ఆసుపత్రిలోని గదులు అన్నీ వర్షం తో తడిసిపోతున్నాయి. రోగుల గది మరీ అధ్వానంగా ఉంది. వర్షం పడితే లోపలికి వెళ్లాలంటే భయపడుతున్నారు. వరండా తప్ప అన్నిగదులు తడిసి ముద్దవుతున్నాయి. ఈ వాతావరణం చూసి రోగులు కొత్త ఆసుపత్రి కట్టే వరకు ఈ తిప్పలు తప్పవంటున్నారు. ఈ ఆసుపత్రి పరిస్థితిపై ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు ప్రజ్ఞను వివరణ కోరగా ఆసుపత్రిలో వర్షం నీరుకు గదులన్నీ తడిచిపోవడంతో రోగులు, సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఆసుపత్రికి రూ.50లక్షలు మంజూరైంది. గత సంవత్సరం అక్టోబర్ లో ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ చెప్పారు. అయితే ఆసుపత్రి నిర్మాణం పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో రోగులు వర్షం వస్తే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి కొత్త ఆసుపత్రిని త్వరిత గతిన పూర్తిచేయాలని కోరుతున్నారు.



ఆసుపత్రి గదులలోకి చేరిన వర్షం నీరు

రాజానగరం అభివృద్ధికి రూ.1361 కోట్లతో కార్యాచరణ

» ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖజానా మొత్తం ఖాళీ
» సాధారణ ఖర్చులకు కూడా సొమ్ముల్లేని దుస్థితి
» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, జూన్ 28: రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి రూ.1361 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజానగరం మండలంలోని పుణ్యక్షేత్రం, నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.ఎర్రంపాలెం, కొత్తతుంగపాడు, పాత తుంగపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖజానా మొత్తం ఖాళీ అయిందని, సాధారణ ఖర్చులకు కూడా ఖజానాలో సొమ్ములు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. వివిధ పనులకు సంబంధించి రూ.216.17 కోట్లు మేర నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాగునీటికి రూ.18.16 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ద్వారా జలజీవన్ మిషన్ పథకాలకు రూ.37 కోట్లకు పైబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బకాయిల కారణంగా వివిధ సాగునీటి పథకాల మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో కనీసం మరమ్మతు పనులైనా చేయాలని కోరగా కాంట్రాక్టర్లు సుముఖత వ్యక్తం చేశారన్నారు. అలాగే రాజమహేంద్రవరం-సీతానగరం రహదారి పనులు వివిధ కారణాలతో ఆగిపోయాయన్నారు. తొలుత రూ.70 కోట్ల ప్రతిపాదనలతో ప్రణాళిక రూపొందించారని, పనులు ఆలస్యం కావడంతో అంచనా వ్యయం రూ.104 కోట్లకు పెరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

అయితే ఈ విషయాన్ని గత ప్రభుత్వం దాచిపెట్టిందని కొన్ని న్యాయపరమైన చిక్కులు కూడా ఏర్పడ్డాయన్నారు. స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి ఈ విషయాలపై చర్చించి నచ్చజెప్పి పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఆపని చేయలేదని దాంతో అంచనా విలువలు పెరిగిపోయాయన్నారు. ఇదిలా ఉండగా నామవరంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. పిల్లలను తన ఒడిలో కూర్చో పెట్టుకుని మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సిద్ధం చేసిన అన్నం, పప్పు కలిపి పిల్లలకు తినిపిస్తూ మధ్య మధ్యలో తాను కూడా రుచి చూశారు. అలాగే ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యం



కొమరిపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

» కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం
» నేడు పొలాలకు నీరందించలేక దుస్థితి
» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూన్ 28: రంగంపేట మండలంలో ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కొమరిపాలెంలో శుక్రవారం లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాగల్నాడులో 35వేల ఎకరాల ఆయకట్టు వుందని, అయితే రంగంపేటలో 23 వేల ఎకరాలకు నీరందించవలసి ఉండగా 2800 ఎకరాలకే అందుతుందన్నారు. అలాగే వెంకటనగర్ లిఫ్ట్ నుంచి 6360, పుష్కర లిఫ్ట్ నుంచి 2800 ఎకరాలకు నీరందుతుందన్నారు. గత ప్రభుత్వం కాలువల మెయిన్‌టెన్స్, పూడికతీత పనులకు కాంట్రాక్టర్లకు రూ.7 కోట్లకు పైగా బిల్లులు చెల్లించకపోవడంతో నేడు పొలాలకు నీరందించలేక పోతున్నామన్నారు. కొన్ని నిధులు మంజూరు చేయించి తక్షణమే నీరందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 1న కూటమి నాయకులు, అధికారులు కలసి పింఛనుదార్ల ఇళ్లకు వెళ్లి పెంచిన రూ.4 వేల పింఛనుతో పాటు, బకాయి రూ.3 వేలు కలిపి రూ.7 వేలు అందిస్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల రాము, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీనివాసరావు, డీవీఆర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి

అనపర్తి, జూన్ 28: అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో దేవదాయ శాఖాధికారులు, కూటమి నాయకులు, ఆలయ ధర్మకర్తలతో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అనేక పురాతన ఆలయాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గొల్లల మామిడాడ సూర్య దేవాలయం, రామాలయం, బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి, లక్ష్మీగణపతి ఆలయాలతోబాటు రంగంపేట, అనపర్తిలోని పురాతన ఆలయాల స్థితిగతులను అడిగి తెలుసుకుని వాటి అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వ పరంగా నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ సుబ్బారావు, నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, వాసు, మేడపాటి రామలింగారెడ్డి, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

రంగంపేట, జూన్ 28: మండలంలోని ఈలకొలను శివారు అచ్యుతాపురంలో డయేరియా ప్రబలి అస్వస్థతకు గురైన ఎనిమిది మంది రోగులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పరామర్శించారు. వ్యాధి ప్రబలడానికి కారణాలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగించాలని ఆదేశించారు. అలాగే వాటర్ పైప్‌లైన్ లీకేజీలు, పారిశుధ్యం పనులను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట నాయకులు ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు ఘైలవరపు సాయిరాం, జనసేన నాయకుడు ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి: డీవైఈవో

కడియం, జూన్ 28: మాధవరాయుడుపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీవీఎస్ఎస్ఎస్ నారాయణ సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల ప్యానల్ మెంబర్లు అయిన హెచ్ఎం కేవీ రమణరావు, ఎస్ఎల్‌వీ రమేష్, జ్ఞిప్రమీలారాణి, పి.రాజు, నాగరాజు, గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, విజయకుమారి.. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల రాత పుస్తకాలు, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. డీవైఈవో ప్రతీ తరగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని, మొదటి నుంచి ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. అలానే 9, 8 తరగతుల విద్యార్థుల ట్యాబ్‌ల వాడకాన్ని, రాత పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం ఈవీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ భద్రతకు డయల్ 86939 34567

సుపరిపాలన అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేయడంలో భాగంగా 'మీ భద్రత మా బాధ్యత'కు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పేర్కొన్నారు. భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా 'మీ భద్రత మా బాధ్యత' హెల్ప్‌లైన్ నెం.86939 34567కి ఫోన్ చేయవచ్చని తెలిపారు. పోలీసుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ బర్మా కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రతలో భాగంగా బ్లేడ్‌బ్యాచ్, గంజాయి, ఆకతాయిలు, అల్లరి మూకల ఆగడాలను అరికట్టడం వంటి పలు అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. వీటి నిర్మూలనకు ప్రజలను చైతన్యం చేయడానికి ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకాశంనగర్ సీఐ సత్యనారాయణ, సెట్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నిక్సన్, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, వర్రే శ్రీనివాస్, బుడ్డిగ రాధ, మరుకుర్తి రవి యాదవ్, కంటిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28: కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ వెళ్లిన ఆయన శుక్రవారం మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలను కలిశారు.

ఓటమిని వైసీపీ హుందాగా తీసుకోవాలి

బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును వైసీపీ గౌరవంతో హుందాగా స్వీకరించాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక సంచలనం అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని రాహుల్‌గాంధీ ప్రస్తావించారని, ఆంధ్రలోనూ మాకు అనుమానాలున్నాయంటూ ఓడిపోయిన పార్టీ ప్రకటించించడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్రంలో అధికార కూటమిలో ఉన్న పార్టీలు సమగ్ర, సమష్టి ప్రణాళిక, అభివృద్ధి లక్ష్యంగా వికసిత ఆంధ్ర అనే ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు దత్తు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపూడి వెంకటరమణ జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: హాస్యంతో తాత్వికతను ముడిపెట్టిన కర్మయోగి ముళ్లపూడి వెంకటరమణ అని పలువురు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నటరాజ నృత్యనికేతన్‌లో కళాగౌతమి, నటరాజ నృత్యనికేతన్ సంయుక్తంగా ముళ్లపూడి వెంకటరమణ 93వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి, హాస్యం క్లబ్ కన్వీనర్ హనుమంతరావు, ఎస్‌కేవీటీ తెలుగుశాఖ విభాగాధిపతి పీవీబీ సంజీవరావు, కాకినాడ కవి ఓబులేసు, బీహెచ్‌వీ రమాదేవి, నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్, ఎంవీ అప్పారావు, సీఆర్ఎం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పల్లాను కలిసిన టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లా శ్రీనివాసరావుకు ఎన్‌టీఆర్ విగ్రహం బహూకరించి శాలువాతో సత్కరించారు. సంసాని ప్రసాద్, రాపాక నరేష్, మేకా విజయ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

సీతానగరం, జూన్ 28: ఉండేశ్వరపురంలో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఫైలేరియా, టైఫాయిడ్, డెంగీ, పచ్చకామెర్లు, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీరు తాగాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకూడదని చెప్పారు. కార్యక్రమంలో మాకాల ఈశ్వరరావు, కార్యదర్శి విఠల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లలితా సహస్ర పారాయణం

గోకవరం, జూన్ 28: గోకవరంలోని వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. 11 రోజుల పాటు తలపెట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రోజుకు మూడు సార్లు ఆర్యవైశ్య సంఘ మహిళలు లలితా సహస్ర పారాయణం చేయను న్నారు. పారాయణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఎస్ఐ నాగరాజుకు అభినందన

గోకవరం, జూన్ 28: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలను కాపాడంలో విశేష కృషి చేసిన గోకవరం ఎస్ఐ కె.నాగరాజుకు ఉన్నతాధికారుల నుంచి అభినందనలు అందాయి. కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడమే కాకుండా, అక్రమ మద్యం, సారా తయారీ, అమ్మకందారులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన నాగరాజును జిల్లా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం అభినందించి క్యాష్ రివార్డుతో పాటు, ప్రశంసాపత్రం అందజేసారు.

మొక్కుతీర్చుకున్న టీడీపీ అభిమాని

కడియం, జూన్ 28: రాష్ట్రంలో కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎం కావడంతో టీడీపీ అభిమాని యామి గంగరాజు శుక్రవారం తన మొక్కు చెల్లించుకున్నాడు. కడియం భాస్కరనగర్‌కు చెందిన గంగరాజు 2024 ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే కడియం శ్రీదేవి తల్లికి పసుపు, కుంకుమ, చీర, సారెలు సమర్పిస్తానని, 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నాడు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో మొక్కు చెల్లించాడు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దామిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం

కడియం, జూన్ 28: దామిరెడ్డిపల్లిలో కొండేటి సుజానమ్మ-విజయరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. రాజమహేంద్రవరం శాంతి ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సత్తి రవికాంత్ ఆధ్వర్యంలో 150 మందికి చెవి, ముక్కు, గొంతులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్లు ద్వారంపూడి శ్రీకాంత్‌రెడ్డి, పిన్నమనేని ప్రియ, అరిగెల చంద్రశేఖరరావు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ



దివాన్‌చెరువు, జూన్ 28: పర్యావరణ పరిరక్షణతో భావితరాలకు మనుగడ ఉంటుందని దివాన్ చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్ ఛైర్మన్ జె.ఉదయ్‌భాస్కర్ అన్నారు. కాలుష్యరహిత సమాజానికి శ్రీకారం పలుకుతూ పాఠశాల చిన్నారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జె.కరుణ్‌దీప్, జె.అరుణదీప్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడియం, జూన్ 28: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే నిర్వహించి ఎటువంటి డయేరియా లక్షణాలు కనిపించినా ప్రాథమిక వైద్యం అందించి కడియం సీహెచ్‌సీకి తరలించాలన్నారు. జూలై, ఆగస్టు నెలలను డయేరియా నివారణ మాసాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా అంతా పనిచేయాలని ఎంపీడీవో చెప్పారు.

పీజీ ఎంట్రన్స్‌లో 'ఆర్ట్స్' విద్యార్థినికి స్టేట్ ఫస్ట్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో బయోటెక్నాలజీ విభాగంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎస్‌టీవీ సుష్మ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకును సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. మొత్తం 100 మార్కులకు 78 మార్కులు సాధించిందన్నారు. పీజీ ప్రవేశ పరీక్షలో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ విజయాలను సాధించారన్నారు. పదిమందికి పైగా విద్యార్థులు సింగిల్ డిజిట్ ర్యాంకులు, 15 మందికిపైగా రెండంకెల ర్యాంకులు, అనేక మంది విద్యార్థులు మూడంకెల ర్యాంకులను సాధించారని తెలిపారు.

నన్నయ వర్సిటీ అక్రమాలపై ఉక్కుపాదం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అక్రమాలపై ఉక్కు పాదం మోపుతామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. అక్రమాల పుట్టగా మారిన నన్నయ వర్శిటీపై విచారణ చేపట్టామన్నారు. రాజానగరం మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేకు వీసీ దగ్గరి బంధువు కావడంతో వారంతా అన్ని విషయాల్లో దోపిడీకి పాల్పడ్డారన్నారు. వర్శిటీ ఈసీ సభ్యుడిగా, ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా కూడా మాజీ ఎమ్మెల్యే తన సొంత మామను నియమించుకున్నట్టు తెలిసిందన్నారు. అన్ని కమిటీల్లో ఆయనను పెట్టుకుని ఆర్థికంగా ఉన్న అన్ని డిపార్టుమెంట్ల నుంచి గట్టిగా దోచేసినట్టుగా వినిపిస్తోందన్నారు. కొన్ని షాపులను అద్దెలకు ఇచ్చారని, ఎవరి దగ్గరా అద్దెలు తీసుకోకుండా వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. సరైన ఇంజనీర్లు లేకపోయినప్పటికీ వారి ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తున్నారన్నారు. అనుబంధ కళాశాలలు, విద్యార్థుల నుంచి వచ్చిన సొమ్మును వారిలో వారే ఒక ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం పెట్టుకుని ఫైనలైజ్ చేసి కోట్లాది రూపాయలు వాడుకున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వైసీపీకి చెందిన 40మంది కార్యకర్తలకు ఉద్యోగాలిచ్చి ఎన్నికల కోడ్ ఉండగానే వారిని జాయిన్ చేసుకున్నట్టు తెలిసిందన్నారు. అలాగే ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి, దానికి రెండు నెలల ముందు నుంచి సుమారు 60- 70 కోట్ల రూపాయలు నిధులను వివిధ పనులపేరుతో దారి మళ్లించినట్టు సమాచారం ఉందన్నారు. వీటన్నింటిపై విచారణ చేపట్టామని, అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. దుర్వినియోగమైన ప్రతి రూపాయిని తిరిగి వసూలు చేస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల చెప్పారు.

సింగవరంలో విజృంభిస్తున్న పచ్చకామెర్లు

సీతానగం, జూన్ 28: మండలంలోని సింగవరంలో పచ్చకామెర్ల వ్యాధి విజృంభిస్తోందని సర్పంచ్ సంగన పోశియ్య, గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోశియ్య విలేఖరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం డ్రైనేజీలోనే తాగునీటి పైప్ లైన్ వేశారని, అప్పటి నుంచి ప్రజలు ఆరోగ్యాలు పాడవుతాయని, ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్ ప్రమేయం లేకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకపక్షంగా వ్యవహరించారని, దీని పర్యవసానం ఈ రోజున గ్రామానికి చెందిన సుమారు పది మంది పచ్చకామెర్లతో బాధపడుతూ రాజమహేంద్రవరం ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఫెడరల్ బ్యాంకు ఉద్యోగుల ధర్నా



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఫెడరల్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను ఖండిస్తూ శుక్రవారం బ్యాంకు ఉద్యోగులు మెయిన్‌రోడ్డులోని బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంఘం కార్యదర్శి లక్ష్మీపతిరావు మాట్లాడారు. ఉద్యోగులను ఏకపక్ష నిర్ణయాలతో బదిలీలు చేయడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలు జరపాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 12వ వేతన సవరణ వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు రమేష్, సోమరాజు, మురళీ, కీర్తన, తరుణ్, వెంకటేశ్వరరావు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూలై 4 నుంచి శ్రీవరాహిదేవి గుప్త నవరాత్రులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఆషాఢమాసంలో శ్రీ వరాహి గుప్తా నవరాత్రులు పురస్కరించుకుని గాదాల శ్రీ మహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వర స్వామి పీఠంలో జూలై 4 నుంచి 18వ తేదీ వరకూ శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు శ్రీ వరాహిదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారని పీఠాధిపతి గురుగోవిందా తంత్ర, రాజగురు శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలో గుప్తా నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరించారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకూ ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. 18వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ భక్తులందరికీ అమ్మవారి ఎడమ చెవిలో వారి కోరికలు చెప్పుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఇనుగంటివారిపేటలో వివాహిత ఆత్మహత్య

సీతానగరం, జూన్ 28: మండలంలోని ఇనుగంటివారిపేటలో ఓ వివాహిత శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. సుమారు 40 ఏళ్ల వయసున్న మహిళ ఉరి పోసుకుని మృతిచెందినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఎస్ఐ టి.రామకృష్ణను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

షెడ్డు తొలగించొద్దని అధికారులకు వినతి

కడియం, జూన్ 28: సర్వే నెం.454లోని ప్రభుత్వ భూమిలో ప్రభుత్వం నిర్మిస్తున్న రైతుబజార్ సమీపంలో తాత్కాలిక షెడ్ తొలగించ వద్దని, పంచాయతీ అధికారులు అడ్డుకోవద్దని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతితో రైతు బజార్ నిర్మిం చేందుకు కాంట్రాక్టర్ గాలి సుబ్బరాజు లైసెన్సుతో తాను రైతు బజార్ నిర్మాణ బాధ్యతలు చేపట్టానని బాబు తెలిపారు. అందులో భాగంగానే తాత్కాలికంగా మెటీరియల్స్ వేసుకోడానికి, కూలీల విశ్రాంతి కోసం ఈషెడ్డు నిర్మించామన్నారు. కడియం పంచాయతీ వారు ఈనెల 11న తాత్కాలిక షెడ్డు తొలగించుటకు తీర్మానం చేసి వెంటనే తొలగించాలని గోడపత్రిక అంటించారన్నారు. రైతుబజార్ నిర్మాణం పూర్తయిన వెంటనే షెడ్డు తొలగిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే ఏ అభివృద్ధి కార్యక్రమం తలపెట్టినా అభ్యంతరం లేదని బాబు అన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి చర్యలు

త్వరలో అధికారులందరితో సమీక్ష

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందు దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 28: జిల్లాను వ్యవసాయపరంగా మరింత అభివృద్ధి చేసేందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని మంత్రి దుర్గేష్‌ను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వేణుమాధవరావు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యసాయ పరిస్థితులను వివరించారు. త్వరలో జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులందరితోను సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ స్థితిగతులపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి అన్నారని వేణుమాధవరావు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్జీవో అసోసియేషన్

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 28: జిల్లా నూతన కలెక్టర్ పి.ప్రశాంతిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఏపీ ఎన్జీవో సంఘం రాజమహేంద్రవరం యూనిట్ అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ వైవీవీఎస్ నాయుడు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధరావు, ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు, ఆర్.రాజేష్, సంయుక్త కార్యదర్శులు జె.వెంకట్రావు, జి.కుమార్, ఈసీ సభ్యుడు హది కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో అసోసియేషన్‌తో సమావేశం ఏర్పాటు చేస్తానని కలెక్టర్ ప్రశాంతి అన్నారు.

నన్నయలో..తినేశారు!

- అవినీతి కూపంలో నన్నయ వర్శిటీ
- ఇప్పటి వరకూ నలుగురు వీసీల బాధ్యతలు
- అందరిపైనా అవినీతి ఆరోపణలు
- వీసీ రాజీనామా చేయాలని గవర్నర్ ఆదేశం
- అయినా కదలని వీసీ పద్మరాజు
- రూ.7.5 కోట్ల బిల్లులు క్లియర్ చేసే పనిలో నిమగ్నం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నన్నయ వర్శిటీ అవినీతి ఆరోపణలతో అప్రదిష్టపాలైంది. ఒక పక్క అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు. మరో పక్క వీసీల ఇష్టారాజ్యంతో వర్శిటీలో అవినీతి బండారం బయటపడుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో వర్శిటీ పరిధిలో 200లకు పైగా కళాశాలలు ఉన్నాయి. ఈ వర్శిటీ 2006లో ఏర్పడింది. సొంత క్యాంపస్ ఏర్పాటుకు చాలా సమయం పట్టింది. రాజమహేంద్రవరం కేంద్రంగాదివాన్‌చెరువులో సుమారు 98 ఎకరాల్లో దీనిని నిర్మించారు. వర్శిటీ రాకముందు ఆర్ట్స్‌కాలేజీలోని కొన్ని భవనాల్లో కార్యకలాపాలు కొనసాగేవి. ఆ సమయంలో అక్రమంగా అధ్యాపకుల నియామకాలు జరగడంతో అది పెద్ద వివాదమైంది.ఆ తర్వాత జార్జి విక్టర్ వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో క్యాంపస్‌కు ఒక రూపు వచ్చింది. ఆయన హయాంలో ఒక వర్గం వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలున్నాయి. తర్వాత ముత్యాలనాయుడు వీసీగా ఉన్న సమయంలో కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయి. నియామకాల్లో వచ్చిన ఆరోపణలపై కమిటీలు వేసి విచారణ చేపట్టారు. మధ్యలో ఇన్‌చార్జిల పాలనలో కొనసాగింది. అనంతరం పద్మరాజు వీసీగా నియమితులయ్యారు. ఆయనపైనా విమర్శలు గుప్పుమన్నాయి. పద్మరాజు వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు బంధువు. దీంతో ఆయన ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్శిటీల్లో ఇప్పటి వరకూ ఉన్న వైస్‌చాన్సలర్లు అందరూ రాజీనామాలు చేయాలని గవర్నర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది రాజీనామా చేశారు. అయితే వీసీ పద్మరాజు మాత్రం ఇంకా కుర్చీపట్టుకుని వేలాడుతున్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో కొన్ని పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే పనిలో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. శుక్రవారం రూ.7.5 కోట్లకు చెందిన బిల్లును క్లియర్ చేయమని నోట్ ఆర్డర్ పెట్టినట్టు గవర్నర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రస్తుతం ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా వర్శిటీలో ఆయన హయాంలో జరిగిన పలు అంశాలపై కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఉంటూ వైసీపీ ప్రభుత్వంలో తన పలుకుబడి ఉపయోగించి నన్నయ్య వీసీగా పోస్టింగ్ పొందినట్టు సమాచారం. యూనివర్శిటీ



ఇంటర్నల్ ఫండ్స్‌పై వచ్చే వడ్డీని వర్శిటీ అవసరాలకు ఉపయోగించాలి. ఈ ఫండ్స్ బిల్డింగ్ కట్టడానికి అప్పటి ఉన్నత విద్యాశాఖాధికారుల నుంచి పర్మిషన్ తెచ్చుకున్నట్టు ఆరోపణలున్నాయి. అనర్హులైన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించి రూ.లక్షల రాబట్టుకున్నట్టు సమాచారం.అమెరికాలో ఆరునెలల పాటు సెలవులో ఉన్న ఒక ప్రొఫెసర్‌కు ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం కల్పించినట్టు చెబుతున్నారు. ఇక్కడ గిరిధర్ అనే ఒక ఉద్యోగికి రూ.35 వేల వేతనంతో ఉద్యోగం ఇవ్వడంతో ఆందోళన కూడా జరిగింది. ప్రశ్న పత్రాలు నాణ్యత పట్టించుకోకుండా,అయా కళాశాలలే ప్రింట్ చేసుకునేలా అవకతవలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేకపోయినా రిటైరైన ప్రొఫెసర్లకు రూ.వేలాది జీతం ఇస్తూ వారికి కార్లు, గెస్ట్‌హౌస్‌ల వంటి సౌకర్యాలు కల్పించినట్టు విమర్శలున్నాయి.వైసీపీ ఆడించినట్టు ఆడి.. యూనివర్శిటీ పరువు తీసినట్టు ఆరోపణలు ఉన్నాయి.ఇదిలా ఉండగా రాజీనామా చేయాలని గురువారం గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశించారు. అయితే ఆయన శుక్రవారం కూడా రాజీనామా చేయలేదు.ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ వర్శిటీని ఎంతో అభివృద్ధి చేశానన్నారు.



కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న జేసీ తేజ్‌భరత్

కలెక్టర్‌గా ప్రశాంతి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, జూన్28(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు రెండో కలెక్టర్‌గా మహిళా ఐఏఎస్ అధికారి పి.ప్రశాంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2022లో కొత్త జిల్లాగా ఏర్పడిన తూర్పుగోదావరికి తొలి కలెక్టర్‌గా డా.కె.మాధవీలత బాధ్యతలు స్వీకరించారు. ఆమెను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆమె స్థానంలో రెండో కలెక్టర్‌గా కూడా మహిళా అధికారినే ప్రభుత్వం నియమించింది. విశాఖపట్నానికి చెందిన ప్రశాంతి 2014లో ఐఏఎస్‌కు అర్హత సాధించారు. అంతకు ముందు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె భర్త ఢిల్లీరావు కూడా ఐఏఎస్ అధికారే. వీరికి ఇద్దరు పిల్లలు. భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు ఆమె తొలి కలెక్టర్‌గా పనిచేశారు. ఎన్నికల ముందు వైసీపీ నేతల ఒత్తిడి వల్ల బదిలీ కాబడి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. శుక్రవారం సుమారు 12 గంటల ప్రాంతంలో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు జేసీ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి తదితర అధికారులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె జేసీ తేజ్ భరత్‌తో కలిసి రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

తొలిరోజే అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ -ఆఫీస్ విధానంలోనే నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజ నల్, మండల, మునిసిపల్ స్థాయి అధికారులతో శుక్ర వారం సాయంత్రం ఆమె పింఛన్ల పంపిణీ,సీజనల్ వ్యాధులు, స్వచ్ఛమైన మంచి నీరు సరఫరా వంటి అంశాలపై జేసీ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 2,44,302 మంది పింఛనుదారులకు రూ.165.13 కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు.అందరూ సమన్వయంతో ఉండాలని, జిల్లా యంత్రాంగా నికి సహకారం అందజేయాలని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉత్త ర్వుల మేరకు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని విధులు నిర్వహిం చడం కీలకమన్నారు.జూలై 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులతో ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. మునిసిపల్ అధికారులు, ఎంపీడీవోలు జిల్లాలో 9,551 క్లస్టర్ వారీగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. కస్టర్ వారిగా సీఎఫ్ఎంఎస్ గుర్తింపు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను లబ్ధిదారులకు అనుసంధానం చేస్తామని చెప్పారు.జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచి నీరు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేయడం వల్ల తనకు గోదావరి జిల్లాల పరిస్థితుల పట్ల కొంత అవగాహన ఉందన్నారు. ప్రస్తుత వర్షాకాల వాతావరణ పరిస్థితుల నేప థ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. డయేరియా కేసులు నమోదైతే అక్కడ పర్యటించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితితో నివేదిక ఇవ్వాలన్నారు.మంచినీటి సరఫరా చేసే ప్రాంతంలో నమూనా పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.గ్రామాలు, పురపాలక సంఘాల్లో ఓహెచ్ఆర్, ట్యాంకుల నిర్వహణ వ్యవస్థను స్వయంగా తనిఖీలు చేసి, రెండు మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సహకారం తీసు కోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి, జిల్లాసూక్ష్మ నీటి యాజమాన్య అధికారి ఎ.దుర్గేష్, భూగర్భజల అధికారి వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఎల్‌డీఎం డీవీవీ.ప్రసాద్, డీఎల్‌పీవోలు పి.వీణాదేవి,వి.శాంతమణి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీకి ఒక్కరు!

- సహకార సంఘానికో పర్సన్ ఇన్‌చార్జి
- జిల్లాలో 107 సొసైటీల్లో తక్షణం అమలు
- కూటమి ప్రభుత్వ ఉత్తర్వులు
- ఇప్పటికే వైసీపీ త్రిసభ్య కమిటీలు రాజీనామా
- మొండికేసిన మోర్త కమిటీ తొలగింపు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సొసైటీ)లకు వైసీపీ బాధ తప్పింది. గత ఐదేళ్లుగా సొసైటీలు త్రీమెన్ కమిటీల పాల నలో ఉన్నాయి. సొసైటీలను రాజకీయ పునరావాసానికి కేంద్రాలుగా మార్చడంతో భారీగా అవకతవకలు జరిగినట్టు సమాచారం. ఇటీవల కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీలో బయటపడిన అక్రమమే దానికి ఉదాహరణ. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సొసైటీల త్రీమెన్ కమిటీలు రాజీనామాలు చేశాయి. ప్రస్తుతం వెంటనే ఎన్నికలు జరిపించే అవకాశం లేకపోవడంతో డిసెంబర్ 20వ తేదీ వరకూ సుమారు ఆరు నెలల పాటు సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కోఆపరేటివ్ అధికారులకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఎ.బాబు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలో 107 సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు.జిల్లాలో సహకార శాఖకు చెందిన ఉద్యోగులు 28 మంది మాత్రమే ఉండడం వల్ల ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు సొసైటీలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని 49 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్టు రాజమహేంద్రవరం డివిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో 58 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్టు కొవ్వూరు కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ తెలిపారు. జిల్లాలో ఉండ్రాజవరం మండలంలోని మోర్త సొసైటీ కమిటీ రాజీనామా చేయకపోవడంతో అధికారులే తొలగించి పర్సన్ ఇన్‌చార్జిని నియమించారు. ఇక నుంచి పాలకవర్గం బాధ్యత పర్సన్ ఇన్‌చార్జిలపై ఉంటుందన్నారు.



ఆర్అండ్‌బీ స్థలంలో అనుమతుల్లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

అక్రమంగా ప్యాలెస్‌ల నిర్మాణం

- వైసీపీ కార్యాలయాల నిర్మాణానికి నిధులెక్కడివి
- విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వాసు డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28 : జగన్ అవినీతికి అంతం లేదని.. రాజమహల్‌ని తలపించే రీతిలో వైసీపీ ఆఫీసుల నిర్మాణానికి సొమ్ములు ఎక్కడ నుంచి వచ్చాయో తేల్చాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆర్అండ్‌బీ భూమిలో నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సుమారు రూ.100 కోట్లు ఉండే 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఏడాదికి కేవలం రూ.వెయ్యి లీజుకి తీసేసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా ఇంతటి పెద్ద భవనాలు చేపట్టడంలో అంతర్యమేమిని ప్రశ్నించారు. ప్యాలెస్ మాదిరిగా జగన్ రెడ్డి ఎందుకు కట్టుకున్నారో అర్థంకావడం లేదన్నారు. వైసీపీ వాళ్ళ ఇష్టానుసారం ప్రభుత్వ ఆస్తులను దోచేసి ఇష్టానుసారం కట్టేశారని ఆరోపించారు. అనుమతులు లేకుండా ఇంత పెద్ద భవనం కడుతుంటే కార్పొరేషన్ అధికారులు ఏంచేశారని.. రుడా ఏం చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. సహకరించిన అధికారులను ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, బీజేపీ నాయకులు బురా రామచంద్రరావు, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, నాయకులు జక్కంపూడి అర్జున్ తదితరులు ఉన్నారు.

ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలు

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు iti.ap.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వచ్చే నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఒరిజినల్స్, ఒక జత జిరాక్సు కాపీలతో వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 92940 50231, 78010 95303 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



హాతవిధి!

అంతా మాట్లాడి ఆమె వెళ్లిపోయారు.. ఇప్పుడెలా : బదిలీపై వెళ్లిన కలెక్టర్ మాధవీలతకు గతవారం వినతిపత్రం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు (ఫైల్)

ఎన్నికల బకాయి రూ.4.2 కోట్లు

- పనిచేసినా పైసలివ్వలేదు..
- పెరిగిపోయిన బకాయిలు
- బీఎల్‌వోలకు రూ.3 కోట్లు
- ఫొటోగ్రాఫర్లకు రూ.1.2 కోట్లు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- అయినా ఉపయోగంలేదు
- ఆర్డర్ ఇచ్చిన కలెక్టర్ బదిలీ
- మాట దాటవేస్తున్న జేసీ
- లబోదిబోమంటున్న బాధితులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు ముగిశాయి.ప్రభుత్వం ఏర్పడింది.. ఎన్నికల విధుల్లో భాగంగా పనిచేసిన కొంత మందికి పడిన బకాయి నేటికీ చెల్లించలేకపోయారు. ఎన్నడూ లేనిది అధికారులు అదిగో ఇదిగో అంటూ గడిపేస్తుండడంతో నిధులు వస్తాయో రావోనని అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం బీఎల్‌వోలు, ఫొటోగ్రాఫర్లకు ఎన్నికల సమయంలో విధులకు సంబంధించి బకాయిపడ్డారు.ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ ప్రైవేట్ ఫొటోగ్రాఫర్లను అద్దె ప్రాతిపదికన రంగంలోకి దించారు. ఎన్నికలు ముగిసినా డబ్బులు రాకపోవడంతో అధికారుల చుట్టూ ప్రద క్షిణలు చేస్తున్నారు.గత నాలుగేళ్లుగా ఓటర్ల జాబితాల తయారీలో నిమగ్నమై ఉన్న బీఎల్‌వోల పరిస్థితీ ఇలాగే ఉంది. కొత్త కలెక్టర్ అయినా తమ ఇక్కట్లు పట్టించుకుని బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఫొటోగ్రాఫర్లు 240 మంది..

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 240 మంది వీడియో గ్రాఫర్లను పాత కలెక్టర్ మాధవీలత నియమించారు. జీఎస్ఎల్‌లో తొలిగా సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలపై ఒప్పందం చేసుకున్నారు. 8 గంటలకు రూ.2250 చొప్పున ప్రతి పది రోజులకూ చెల్లింపు చేస్తా మని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆర్డరు కాపీలను కూడా వీడియోగ్రాఫర్లకు ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న వెలువడగా 17వ తేదీ నుంచి వీళ్లంతా కెమెరాలతో విధుల్లోకి వచ్చారు. అధికారులు కేటాయించిన చోట విధులు నిర్వర్తించారు. ప్రతి ఘటన వీడియో తీసి చిప్ లేదా సీడీలో నిక్షిప్తం చేసి అధికారులకు అందజేసేవారు. షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధుల్లో ఉండేవాళ్లు. విధుల్లో చేరిన పది రోజుల తర్వాత వీడియోగ్రాఫర్లు తమ డబ్బులను అడిగితే కాలయాపనతో నెట్టుకొచ్చారు. ఎన్నికలు ముగిసి..కొత్త ప్రభుత్వం కొలువుదీరి 25 రోజులు దాటినా వీడియోగ్రాఫర్ల చేతికి పూర్తి స్థాయిలో డబ్బులు అందలేదు.ఇదిలా ఉండగా మాధవీలత బదిలీపై వెళ్లిపోయారు. వీడియోగ్రాఫర్లు బదిలీ కలెక్టర్‌కు తమ బకాయిలను గుర్తుచేస్తే ఆ పని జేసీ చూస్తారని చెప్పారు. జేసీని అడిగితే బిల్లు పంపామని.. విజయవాడ ఎన్నికల సంఘం వద్దకు వెళ్లి అడగండని జేసీ ఉచిత ఇస్తున్నారని వీడియోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కలెక్టరుకు మళ్లీ లేఖ ఇవ్వాలని సూచించారన్నారు. మీకు ఆర్డరు ఎవరిచ్చారో వాళ్లను అడగాలంటూ అనపర్తి, గోపాలపురం ఆర్వోలు గదమాయిస్తున్నారని వాపోతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది

సొంత కెమెరాలు ఉన్నవాళ్లు కొందరైతే, కెమెరాలను అద్దెకు తెచ్చుకొని మరికొందరు పనిచేశారు.రాజమహేంద్రవరంసిటీకి సంబం ధించి దాదాపు 70 శాతం చెల్లించగా..మిగతా నియోజకవర్గాల్లో 30 శాతం మాత్రమే చేతికందాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.అద్దెకు కెమెరాలు తెచ్చుకుని కష్టపడిన వాళ్ల సమస్య ఎదుర్కొం టున్నారు. అన్ని నియోజక వర్గాల్లో 58 రోజులకు కలిపి మొత్తం బకాయిలు రూ.1.20 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది.వాస్తవానికి ఎన్నికల ప్రక్రియకు అవసరమైన నిధులు ఎన్నికల సంఘం ద్వారా వస్తాయి. వీడియో గ్రాఫర్లకు సంబంధించి ఆర్వోలకు నేరుగా నిధులు వస్తాయని చెబుతున్నారు. అయితే, కలెక్టరు సూచ నల మేరకు వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆర్వోలు వీడియో గ్రాఫర్లకు సరైన సమాధానం చెప్పడం లేదని తెలుస్తోంది.

బీఎల్‌వోలు 1600 మంది..

బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వోలు) సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడంలో తమదైన పాత్ర పోషించారు. నాలుగేళ్ల నుంచీ రాత్రి పగలూ తేడా లేకుండా కసరత్తు చేశారు. ఓటరు గుర్తింపునకు ఆధార్ అనుసంధానం, ఓటరు తొలగింపు,చేర్పు, చిరునామా మార్పు, ఫిర్యాదుల పరిష్కారం వంటి కీలకమైన విధులు నిర్వ ర్తించారు.కానీ వారికి ఈ నాటికీ శ్రమకు తగిన ఫలితం అందలేదు. సుమారు మూడేళ్ల నుంచీ గౌరవ భృతి రాకపోయినా సొంత డబ్బులతో అధికారులు చెప్పిన పనులన్నీ చేశారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలుదీరినా వీరి డబ్బులు మాత్రం చేతిలో పడలేదు.2024 సార్వత్రిక ఎన్నికల నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 2020లో కసరత్తు మొదలైంది. సచివాలయ సిబ్బందిని బీఎల్‌వోలుగా నియమించారు. వారి రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే బీఎల్‌వో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇం టింటికీ వెళ్లి మార్పులుంటే ఓటరు జాబితాల్లో సవరణ చేయడం, ఆధార్ సీడింగ్ ముఖ్య విధులు.దీని కోసం యాప్‌లను ఇచ్చారు.సర్వర్లు నెమ్మదిగా ఉండడంతో రాత్రి వేళల్లో కూడా మహిళలు సైతం వీధుల్లో తిరిగి విధులు నిర్వర్తించారు. ఓటరు జాబితాల్లో తప్పులు సరిదిద్దారు.ఈ పనులు చేసినందుకు వీరికి నె లకు రూ.500 గౌరవ భృతి, ఏడాదికి రూ.వెయ్యి డీఏ, టీఏ, స్టేషనరీ కింద ఇవ్వాలని ఎన్నికల సం ఘం నిర్దేశించింది. కానీ, మూడేళ్ల నుంచీ ఖాతా లో ఆ సొమ్ములు జమ కాలేదు.జిల్లాలో సుమా రు 1,600 మంది బీఎల్‌వోలు విధులు నిర్వర్తించారు.వీరికి మూడేళ్లకు రూ.3 కోట్ల కుపైగా భృతి అందాల్సి ఉంది. అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు.

గౌరవ భృతి ఇవ్వడంలేదు..



ఎన్నికల సందర్భంగా నాలుగేళ్ల నుంచీ సమర్థవంతంగా పని చేశాం. ఎప్పటికప్పుడు గౌరవ భృతి, టీఏ, డీఏ ఇవ్వకపోయినా నిర్దేశిత సమయాలు లేకపోయినా రేయింబవళ్లు కష్టబడి అధికారులు చెప్పిన సమయానికి పనులు పూర్తి చేశాం.ఎన్నికలు సజావుగా జరగడానికి మా వంతు పాత్ర నిర్వర్తించాం. కానీ మా గౌరవ భృతి విషయంలో తీవ్రంగా జాప్యం కావడం ఆవేదనకు గురిచేస్తోంది.మండల స్థాయి అధికారులకు విన్నవించినా ఉపయోగం లేదు. ఉన్నత స్థాయి అధికారులు మా సమస్యకు పరిష్కారం చూపాలి.

- కాదంబరి సూర్య శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్, కడియం సచివాలయం

కొత్త కలెక్టర్‌కు లెటర్ ఇవ్వాలట..



మా బకాయిల విషయం జేసీ చూస్తారని పాత కలెక్టర్ చెప్పి వారం అయిపోయింది. ఆమె రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. రోజులు గడుస్తున్నాయే గానీ డబ్బులు ఇవ్వడం లేదు. మళ్లీ ఈ శుక్రవారం కలెక్టరేట్‌కి వెళ్తే.. కొత్త కలెక్టర్ ఇప్పుడే చార్జి తీసుకున్నారు. రేపు వచ్చి ఆమెకు మళ్లీ లెటర్ ఇవ్వండని చాలా సులభంగా చెప్పేశారు. చిన్నోళ్లమని ఇబ్బంది పెడితే ఎలా?. మేం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు అర్థం చేసుకోవాలి.

- కోనీ శ్రీను, అధ్యక్షుడు, జిల్లా ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

జేసీ విజయవాడ వెళ్లమంటున్నారు..



మా బకాయిల కోసం గత శుక్రవారం ధర్నా చేసిన ప్పుడు జేసీ, కలెక్టర్(పాత) లోపలికి పిలిపించి ఎలక్షన్ కమిషన్‌కి బిల్లు పెట్టామని, బకాయిలు వచ్చేస్తాయని చెప్పారు. కానీ ఫలితం లేదు.వారం తర్వాత ఈ రోజు (శుక్రవారం) జేసీని కలిశాం. విజయవాడ వెళ్లి ఎలక్షన్ కమిషన్‌ని కలవండని అంటున్నారు. పనికి ముందు 10 రోజులకు ఒకసారి పేమెంట్ చేస్తామన్నారు. ఇప్పుడు పని అయిపోయిన తర్వాత ఇలా అనడం ఎంత వరకూ న్యా యం.

- ఎ.ఫణి కుమార్, కార్యదర్శి, జిల్లా ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్

నేడు జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ శనివారం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. ఉదయం 10గంటల నుంచి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌కి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం,రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు కోర్టుల్లో ఏర్పాట్లు చేశామన్నారు. పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి : మంత్రి దుర్గేష్

చాగల్లు మాజీ ఎంపీపీ సాహెబ్ ఇంట్లో చోరీ

6



నెలవారీ నేరసమీక్షలో భాగంగా ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న పోలీసులు

సైబర్ నేరాలపై దృష్టి పెట్టండి

నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సైబర్, మహిళలపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని.ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం మరింత పెంపొందే విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాలు,సారా, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసుల పరిష్కారం దిశగా కృషి చేస్తూ శిక్షలు పడే శాతాన్ని పెంచాలన్నారు. పగలు, రాత్రి గస్తీని విస్తరించి సరైన రీతిలో పెట్రోలింగ్ జరిగేలా అధికారులు చూసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, అల్లరి మూకలపై నిఘా పటిష్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, ఇష్టానుసారం డ్రైవింగ్ చేయడం వంటి వాటిని ఉపేక్షించవద్దన్నారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. స్కూల్స్, కాలేజీల వద్ద ట్రాఫిక్ నిబంధనలపై, మాదకద్రవ్యాల వాడకం వల్ల దుష్పరిణామాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు.డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం(మీకోసం)కు వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల విధుల్లో ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, టి.సర్కార్, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడికి జవహర్ అభినందన



పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న జవహర్

కొవ్వూరు/గోపాలపురం, జూన్ 28: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ జాతీయ ప్రధన కార్యదర్శి కేఎస్ జవహర్ అభినందించారు. శుక్రవారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయనను కలిసి కండువా కప్పి అభినందనలు తెలిపారు.. జవహర్ వెంట బూరుగుపల్లి రాఘవులు, పసలపూడి బోసు తదితరులున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు పదవి స్వీకార కార్యక్రమానికి గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి నూతంగి దొరబాబు హాజరయ్యారు. పుష్పగుచ్చం ఇచ్చి నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

సుందర గోవిందుడికి పూజలు

కొవ్వూరు, జూన్ 28: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు, సహస్ర కుంభాభిషేకాలు మూడో రోజు కొనసాగాయి. శుక్రవారం మండప పునః పూజ, చండీ సప్తశతి పారాయణ, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర మూలమంత్ర జపాలు, అవాహిత దేవత, శ్రీసుబ్రహ్మణ్య చండీ హోమాలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వాగతం బోర్డులకు కొత్త రూపు

పెరవలి, జూన్ 28: గ్రామ పంచాయతీల పరిధిలో స్వాగతం బోర్డులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉన్న బోర్డులను తీసివేసి కొత్తగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి దుర్గేష్ ఫొటోలు ఉండే విధంగా సర్పంచ్‌లు బోర్డులు తయారు చేయించి గ్రామానికి ఇరువైపులా సరిహద్దుల్లో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వైసీపీలో ఉన్న కొంతమంది సర్పంచ్‌లు కూడా ప్లేట్ మార్చి కొత్త ప్రభుత్వానికి అనుగుణంగా ఈ విధంగా బోర్డులు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు.

గ్రామాల్లో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం



కొత్తపల్లిలో కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

పెరవలి, జూన్ 28: వర్షాలు విరివిగా కురుస్తుండడంతో ఉపాధి హామీ పథకం కింద పలు గ్రామ పంచాయతీల పరిధిలో కొబ్బరి మొక్కలు నాటుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా మొక్క నాటిన పాపాన పోలేదు. పంచాయతీల పరిధిలోని పోరంబోకు స్థలాలు, చెరువుగట్లు వెంబడి కొబ్బరి మొక్కలు నాటితే పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. గతంలో ప్రతి వర్షాకాలంలో పంచాయతీ స్థలాల్లో కొబ్బరి మొక్కలు నాటడమే కాకుండా ప్రజలకు ఉచితంగా అందజేసేవారు. ప్రస్తుతం అదేవిధంగా మొక్కలు నాటే కార్యక్రమం గ్రామాల్లో చేపట్టారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలి



నిడదవోలులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడదవోలు, జూన్ 28: పార్వతిపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివం గ్రామంలో దళితులపై దాడి చేసిన పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నిడదవోలులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాంబాబు అన్నారు. ఈ దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా వారిలో ఒక మహిళ కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శేఖర్, నేతాజీ లెనిన్, సత్యానందం, రమేష్, అశోక్ తదితర్లు పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు సురేష్‌కుమార్

తాళ్ళపూడి, జూన్ 28: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాళ్ళపూడి శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా అంకెం సురేష్‌కుమార్ తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా నిత్యం చేసే సేవా కార్యక్రమాలతో పాటు శాశ్వతంగా ఉండే కార్యక్రమాలు కూడా చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. కార్యక్రమంలో గోకవరపు బాబులు, వి.చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, టి.దోసాలు, అప్పన హనుమంతరావు, పి.దుర్గాప్రసాద్, దుగ్గిరాల సూర్యనారాయణ, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ తాళ్లపూడి అధ్యక్షుడిగా వీరభద్రరావు

తాళ్ళపూడి, జూన్ 28: మండలంలోని మలకపల్లిలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం పూర్వ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా కుంటముక్కల వీరభద్రరావు, కార్యదర్శిగా నున్న సోమశేఖర్, కోశాధికారిగా ఎల్లిన బ్రహ్మానందం, కార్యవర్గ సభ్యులతో రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ జిల్లా కమిటీ మెంబరు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ ఇంటర్‌నేషనల్‌లోనే క్లబ్‌కి ఎక్స్‌లెన్సీ అవార్డు వచ్చేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి చీరలు, దీర్ఘకాలిక రోగులకు ఆర్థిక సహాయం అందించారు. మలకపల్లిలో ఒక డయాలసిస్ పేషెంటుకి సుబ్బరాయచౌదరి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎం.రామ్మూర్తి, గోరిజాల వెంకట ప్రసాదు(జీవీ), నామన పరమేశ్వరరావు, కోఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, చలపాటి ప్రకాష్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు



దేవరపల్లి, జూన్ 28: దేవరపల్లి 3 గ్రామ సచివాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను శుక్రవారం పంచాయతీ అధికారులు, టీడీపీ జన సేన నాయకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరి రాంబాబు, యాగంటి వెంకటేశ్వర రావు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కంబాల సత్తిబాబు, ఆడబాల మణికంఠ, జాజిమొగ్గల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రవికిషోర్, నూరిశెట్టి బాలు పాల్గొన్నారు.

పీజీ ఎంట్రన్స్‌లో 'ఆర్ట్స్' విద్యార్థినికి స్టేట్ ఫస్ట్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో బయోటెక్నాలజీ విభాగంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎస్‌టీవీ సుష్మ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకును సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. మొత్తం 100 మార్కులకు 78 మార్కులు సాధించిందన్నారు. పీజీ ప్రవేశ పరీక్షలో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ విజయాలను సాధించారన్నారు. పదిమందికి పైగా విద్యార్థులు సింగిల్ డిజిట్ ర్యాంకులు, 15 మందికిపైగా రెండంకెల ర్యాంకులు, అనేక మంది విద్యార్థులు మూడంకెల ర్యాంకులను సాధించారని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేర్చాలి

- పాఠశాలల్లో డ్రాపవుట్లు లేకుండా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్

ఉండ్రాజవరం, మే 28: ప్రభుత్వ పథకాలను, ప్రయోజనాన్ని క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ చేర్చే బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరంలో మండలస్థాయి అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తూ, సుపరిపాలనకు అధికారులు సహకరించాలన్నారు. జూలై నెల నుంచి అర్హులైన పింఛను లబ్ధిదారులకు ప్రభుత్వ హామీ మేరకు రూ.4 వేలు పంపిణీ చేస్తారన్నారు. వీటితోపాటు మూడు నెలలకు వెయ్యి చొప్పున రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7వేలు లబ్ధిదారులకు అందజేస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినప్పటికీ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందిస్తామన్నారు. విద్యాలయాల్లో డ్రాప్‌అవుట్ లేకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని చెప్పారు. విద్యార్థులకు మంత్రి దుర్గేష్ విద్యాకిట్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు మంత్రి దుర్గేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీవో కె. నరేంద్ర రెడ్డి, ఈవోపీఆర్డీ జేవీడీవీ ప్రసాద్, నాయకులు సింహాద్రి రామకృష్ణ, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

మంత్రి దుర్గేష్‌ను కలిసిన సువర్ణరాజు

దేవరపల్లి, జూన్ 28: మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు, నాయకులు శుక్రవారం నిడదవోలులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ మండలంలోని త్యాజంపూడి-పొంగుటూరు, దొండపూడి-దేవర పల్లి-లక్ష్మీపురం గ్రామాల మధ్య పోలవరం కాల్వపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరినట్టు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమ స్యలన్నీ సానుకూలంగా పరిష్కరిస్తానని తెలిపారన్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు కాట్నం గణేష్, నల్లజర్ల అధ్యక్షుడు బాపిరాజు, గోపాలపురం అధ్యక్షుడు రాజేంద్ర, నాయుడు దుర్గాప్రసాద్, అచ్యుత సత్యనారాయణ, శివనాగప్రసాద్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సాకులతో పనులు వాయిదా వేయకండి



ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరిస్తున్న మదర్సా సభ్యులు

- ప్రతి ఉద్యోగి బాధ్యతయుతంగా పని చేయాలి
- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు
- నల్లజర్ల మండల సర్వ సభ్య సమావేశం

నల్లజర్ల, జూన్ 28: ప్రతి ఉద్యోగి సాకులతో పని వాయిదా వేయకుండా విధులు నిర్వర్తించాలని, డ్యూటీని కష్టంతో కాకుండా ఇష్టంతో చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. నల్లజర్ల మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. దీనికి ఎమ్మెల్యే మద్దిపాటి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలోనే గోపాలపురాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే సముదాయంలో ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాలను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేసి ప్రజలకు సుపరిపాలన అందించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి మర్యాదగా, సమస్యలు పరిష్కరించే దిశగా పని చేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణారావు, ఎంపీడీవో నవీన్‌కుమార్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీటీసీలు రావూరి వెంకటరమణ, మండా తులసీ జ్యోతి, ఈడే శ్రీను, సర్పంచ్‌లు నందమూరి శారదదేవి, అచ్యుత సత్యనారాయణ, బాలయ్య, పల్లి జ్యోతి, మల్లిక, యలమాటి శ్రీనివాసరావు, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు.

మదర్సా సమస్యను పరిష్కరిస్తా

మండలంలోని కరిచర్లగూడెంలో ముస్లిం మదర్సా జామియా సిరాజ్ ఉల్లాం నిర్వాహకులు నల్లజర్లలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కలిశారు. మదర్సాలో ఉన్న స్కూల్ మూసివేయాలని ఎంఈవో నోటీసులు ఇచ్చారని, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కర మార్గం చూపుతామని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం మదర్సా సభ్యులు, నల్లజర్ల ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫరూక్, జమాతె ఇస్లామ్ హింద్ మండలాధ్యక్షుడు ఎండీ ఇలియాజ్, యద్దనపూడి బ్రహ్మరాజు, యలమాటి శ్రీనివాసరావు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ అక్రమాలపై ఉక్కుపాదం

- వైస్ చాన్సలర్ మాజీ ఎమ్మెల్యేకు దగ్గరి బంధువు
- ఈసీ సభ్యుడిగా, ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా సొంత మామ
- అన్ని డిపార్టుమెంట్ల నుంచి దోపిడీ : ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, జూన్ 28: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అక్రమాలపై ఉక్కు పాదం మోపుతామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. అక్రమాల పుట్టగా మారిన నన్నయ వర్సిటీపై విచారణ చేపట్టామన్నారు. రాజానగరం మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేకు వీసీ దగ్గరి బంధువు కావడంతో వారంతా అన్ని విషయాల్లో దోపిడీకి పాల్పడ్డారన్నారు. వర్సిటీ ఈసీ సభ్యుడిగా, ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా కూడా మాజీ ఎమ్మెల్యే తన సొంత మామను నియమించుకున్నట్టు తెలిసిందన్నారు. అన్ని కమిటీల్లో ఆయనను పెట్టుకుని ఆర్థికంగా ఉన్న అన్ని డిపార్టుమెంట్ల నుంచి గట్టిగా దోచేసినట్టుగా వినిపిస్తోందన్నారు. కొన్ని షాపులను అద్దెలకు ఇచ్చారని, ఎవరి దగ్గరా అద్దెలు తీసుకోకుండా వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. సరైన ఇంజనీర్లు లేకపోయినప్పటికీ వారి ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తున్నారన్నారు. అనుబంధ కళాశాలలు, విద్యార్థుల నుంచి వచ్చిన సొమ్మును వారిలో వారే ఒక ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం పెట్టుకుని ఫైనలైజ్ చేసి కోట్లాది రూపాయలు వాడుకున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ అమ లులో ఉండగా వైసీపీకి చెందిన 40మంది కార్యకర్తలకు ఉద్యోగాలిచ్చి ఎన్నికల కోడ్ ఉండగానే వారిని జాయిన్ చేసుకున్నట్టు తెలిసిందన్నారు. అలాగే ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి, దానికి రెండు నెలల ముందు నుంచి సుమారు 60- 70 కోట్ల రూపాయలు నిధులను వివిధ పనులపేరుతో దారి మళ్లించినట్టు సమాచారం ఉందన్నారు. వీటన్నింటిపై విచారణ చేపట్టామని, అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. దుర్వినియోగమైన ప్రతి రూపాయిని తిరిగి వసూలు చేస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

చాగల్లు మాజీ ఎంపీపీ సాహెబ్ ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చాగల్లు, జూన్ 28: స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయ సమీపంలోని మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ ఇంట్లో చోరీ జరిగింది. ఆయన వివరాల ప్రకారం.. సాహెబ్ గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటిని శుభ్రం చేసేందుకు పనిమనిషి రాగా తాళం పగలగొట్టి ఉండడంతో ఫోన్ చేసి చెప్పగా ఇంటికి వచ్చి పరిశీలించారు. దొంగలు ఇంట్లోని బీరువాను పగలగొట్టి సుమారు 24 కాసుల బంగారం, 100 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేలకు పైగా నగదు అపహరించుకుపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ పి.నాగరాజు, క్లూస్ టీం సభ్యులతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని ఎస్ఐ నాగరాజు అన్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే సందర్భంలో కనీసం ఒకరైనా ఇంట్లో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులకు తగిన సమాచారం ఇస్తే రాత్రి గస్తీ తిరిగే సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. బైక్ దొంగతనాలు జరగకుండా తాళాలు వేసుకోవాలని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

పోలీసులకు ఎస్పీ అభినందన



కొవ్వూరు, జూన్ 28: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ జగదీష్ అభినందించారు. శుక్రవారం రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులను అభినందించి, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ అనీల్ శుక్రవారం కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, తాళ్లపూడి ఎస్ఐ శ్యాంసుందర్, చాగల్లు ఎస్ఐ నాగరాజులను సత్కరించారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28: కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ వెళ్లిన ఆయన శుక్రవారం మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలను కలిశారు.

సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలి



సమావేశంలో పాల్గొన్న డీలర్లు

నల్లజర్ల, జూన్ 28: ప్రజలకు చౌక బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలనిసివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణరాజు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు, ఎండీయూ అపరేటర్లకు ప్రజా పంపిణీపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జూలై నెలకు సంబంధించి బియ్యం మాత్రమే పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, వరకుమార్, నాగు, దూళిపల వెంకన్న, అచ్యుత భాస్కరావు, ఎండీయూలు వసంతాడ ఇజ్రాయేలు,తుమ్మల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ చాగల్లు కార్యవర్గ ప్రమాణస్వీకారం



చాగల్లు, జూన్ 28: లయన్స్ క్లబ్ సభ్యులు సేవాభావంతో పనిచేస్తూ తోటి వారికి ఆదర్శంగా ఉండాలని లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ అన్నారు. చాగల్లు, నెలటూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన విచ్చేసి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఆళ్ల సత్యనారాయణ, కార్యదర్శిగా వల్లేపల్లి వెంకటరామారావు, కోశాధికారిగా వల్లభని వీవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలపాటి సాంబశివరావు, కోడి శ్రీనివాసరావు, మేడా ప్రసాద్, రాయపాటి సుబ్బారావు, కోడూరి ప్రసాద్, దొడ్డా వెంకటరావు, లింగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగవరంలో విజృంభిస్తున్న పచ్చకామెర్లు

సీతానగం, జూన్ 28: మండలంలోని సింగవరంలో పచ్చకామెర్ల వ్యాధి విజృంభిస్తోందని సర్పంచ్ సంగన పోశియ్య, గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోశియ్య విలేఖరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం డ్రైనేజీలోనే తాగునీటి పైప్ లైన్ వేశారని, అప్పటి నుంచి ప్రజలు ఆరోగ్యాలు పాడవుతాయని, ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్ ప్రమేయం లేకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకపక్షంగా వ్యవహరించారని, దీని పర్యవసానం ఈ రోజున గ్రామానికి చెందిన సుమారు పది మంది పచ్చకామెర్లతో బాధపడుతూ రాజమహేంద్రవరం ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫెడరల్ బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఫెడరల్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను ఖండిస్తూ శుక్రవారం బ్యాంకు ఉద్యోగులు మెయిన్‌రోడ్డులోని బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంఘం కార్యదర్శి లక్ష్మీపతిరావు మాట్లాడారు. ఉద్యోగులను ఏకపక్ష నిర్ణయాలతో బదిలీలు చేయడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలు జరపాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 12వ వేతన సవరణ వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు రమేష్, సోమరాజు, మురళీ, కీర్తన, తరుణ్, వెంకటేశ్వరరావు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూలై 4 నుంచి శ్రీవరాహిదేవి గుప్త నవరాత్రులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఆషాడమాసంలో శ్రీ వరాహి గుప్తా నవరాత్రులు పురస్కరించుకుని గాడాల శ్రీ మహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వర స్వామి పీఠంలో జూలై 4 నుంచి 18వ తేదీ వరకూ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శ్రీ వరాహిదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారని పీఠాధిపతి గురుగోవిందా తంత్ర, రాజగురు శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలో గుప్తా నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరించారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకూ ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. 18వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ భక్తులందరికీ అమ్మవారి ఎడమ చెవిలో వారి కోరికలు చెప్పుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఇనుగంటివారిపేటలో వివాహిత ఆత్మహత్య

సీతానగరం, జూన్ 28: మండలంలోని ఇనుగంటివారిపేటలో ఓ వివాహిత శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. సుమారు 40 ఏళ్ల వయసున్న మహిళ ఉరి పోసుకుని మృతిచెందినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఎస్ఐ టి.రామకృష్ణను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

డీవైఈవో నారాయణ.. ఎంఆర్ పాలెం హైస్కూల్ తనిఖీ

కడియం, జూన్ 28: మాధవరాయుడుపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీవీఎస్ఎస్ఎస్ నారాయణ సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల ప్యానల్ మెంబర్లు అయిన హెచ్‌ఎం కేవీ రమణరావు, ఎస్ఎల్‌వీ రమేష్, జ్ఞిప్రమీలారాణి, పి.రాజు, నాగరాజు, గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, విజయకుమారి.. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల రాత పుస్తకాలు, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. డీవైఈవో ప్రతీ తరగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని, మొదటి నుంచి ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. అలానే 9, 8 తరగతుల విద్యార్థుల ట్యాబ్‌ల వాడకాన్ని, రాత పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం ఈవీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ భద్రతకు డయల్ 86939 34567

సుపరిపాలన అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేయడంలో భాగంగా 'మీ భద్రత మా బాధ్యత'కు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పేర్కొన్నారు. భద్ర తాపరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా 'మీ భద్రత మా బాధ్యత' హెల్ప్ లైన్ నెం.86939 34567కి ఫోన్ చేయవచ్చని తెలిపారు. పోలీసుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ బర్మా కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రతలో భాగంగా బ్లేడ్‌బ్యాచ్, గంజాయి, ఆకతాయిలు, అల్లరి మూకల ఆగడాలను అరికట్టడం వంటి పలు అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. వీటి నిర్మూలనకు ప్రజలను చైతన్యం చేయడానికి ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకాశంనగర్ సీఐ సత్యనారాయణ, సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నిక్సన్, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, వర్రే శ్రీనివాస్, బుడ్డిగ రాధ, మరుకుర్తి రవి యాదవ్, కంటిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటమిని వైసీపీ హుందాగా తీసుకోవాలి

బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 28: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును వైసీపీ గౌరవంతో హుందాగా స్వీకరించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక సంచలనం అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని రాహుల్‌గాంధీ ప్రస్తావించారని, ఆంధ్రలోనూ మాకు అనుమానాలున్నాయంటూ ఓడిపోయిన పార్టీ ప్రకటించించడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్రంలో అధికార కూటమిలో ఉన్న పార్టీలు సమగ్ర, సమష్టి ప్రణాళిక, అభివృద్ధి లక్ష్యంగా వికసిత ఆంధ్ర అనే ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు దత్తు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

దేవరపల్లి, జూన్ 28: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్రిన్సిపాల్ పి.కిషోర్ అన్నారు. దేవరపల్లిలో శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని విద్యార్థులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య స్కూల్ ప్రాంగణంలోనూ, చుట్టుపక్కల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా ఏజీఎం ఎస్.పార్థసారధి ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	మనమే
వై.స్క్రీన్ 2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---